సరస్వతీగ్రంథమండలి; నాటకానుబంధములు 1.

మార్కండేయ నాటకము.

గ్రంథకర్త:-

పింగళి వేంకటనరసయ్యగారు.

1 St. Edition; 1923.

ప్రకాశకులు:-

అడ్డేపల్లి లక్ష్మణస్వామి,

సరస్వతీ గ్రంథమండలి.

రాజమహేంద్రవరము.

 వెల 0—12—0

ఈ నాటకమునందు వచ్చుపాత్రలు.

బ్రహ్మ సృష్టికర్త
2 ద్వారపాలకులు బ్రహ్మమందిరముకడ నుండువారు
మృకండుఁడు మార్కండేయునితండ్రి యగువాని
ఇద్దఱుమునులు మృకండమిత్రులు
నారదుఁడు త్రిలోకసంచారి
మృకండశిష్యుఁడు మునికుమారుఁడు
కణ్వుఁడు ఒకానొకఋషి
భట్టోజీదీక్షితులు } కాశీపురవాసులగుబ్రాహ్మణులు
వేంకటచైనులు
శారద్వతుఁడు }
మైత్రేయుఁడు } కణ్వశిష్యులు
గాలవుఁడు }

3946 20-1-90

మార్కండేయుఁడు మృకండునికుమారుఁడు (శివపూజాధురంధరుఁడు)
విశ్వామిత్రుఁడు బ్రహ్మర్షి
వసిష్ఠుఁడు దేవర్షి
భృంగిరిటుఁడు ఈశ్వరదూత
శంకరుఁడు కైలాసవాసుఁడు
దీర్ఘకర్ణుఁడు } మార్కండేయునికొరకంపఁబడినయమదూతలు
వక్రనాసుఁడు
యముఁడు పాపులశిక్షించువాఁడు
చిత్రగుప్తుఁడు యమలోకమందలిలెక్కలువ్రాయు కరణము
మఱికొందఱు యమభటులు

స్త్రీలు.

సరస్వతి బ్రహ్మరాణి
గౌరి శంకరుదేవి
మరుద్వతి మృకండుపత్ని
ఇద్దరుఋషికాంతలు మృకండుపర్ణశాలకే తెంచినమార్గస్థులు
N.B. లెక్క కెక్కు డైనను నిరువదిమందితోనిరభ్యంతరముగఁ ప్రదర్శింపవచ్చును

విజ్ఞప్తి.

పూజ్యులగు భాషాభిమానులారా !

చ. ఎఱుఁగను లక్షణం బనఁగ నెట్టిదొ కావ్య పురాణ గాథలన్
బరిచయ మింత లేదు పొరఁబాటులు మెండుగ నుండవచ్చు ధీ
వరులకు మెప్పుఁ గూర్పఁ గలపాటి రసజ్ఞత యేనిఁ గానరా
దరయఁగఁ గాని సౌహృద యులై తిలకింతు రటంచు వ్రాసితిన్.

ఇయ్యది లిఖితరూపమున నాయనుమతిఁ గాని ప్రకాశకుని యనుమతిఁ గానిగైకొనక ప్రదర్శింపఁబడఁ గూడదు.

ప్రదర్శనానుకూలమని యెంచిననాటకసమాజికులు, తాము వలసినవిషయముల నాకెఱింగింతు రేని కృతజ్ఞుఁడ నై ప్రత్యుత్తర మంపింతును. నారదపాత్రకు ఆయాస్థలములందు, ‘‘భజగోవిందం’’ అని ముద్రించి వరుసనెంబరులు గల అనుబంధములలోఁ జేర్చినప్రదేశములకడ భజగోవిందశ్లోకములు పఠించునది యని కోరుచున్నాను.

ఏలూరు.
17-5-23.

ఇట్లు
పింగళి వేంకటనరసయ్య.

కృతిసమర్పణము

శా. శ్రీ కారుణ్య పయోనిధిన్, విజయ లక్ష్మీ నాయకున్, వైరిదు
ర్దీకారణ్య దవానలాయిత ఘనశ్రీ విభ్రమాంక ధ్వనిన్
గాకుత్స్థాన్వయ దుగ్ధ వారినిధి రాకా పూర్ణ శీతాంశు స్వ
ర్లోకా రాతి నిశాచ రాంతకుఁ గృపా లోలాత్ము సేవించెదన్.

క. రామా! జగదభిరామా! రామా!
సుగుణాల లామ రాజుల
లామా! రామా! త్రిజగ న్నుతసు త్రామా!
కృతి నందుకొనవెరఘు వంశమణీ!

ఉ. భక్త వశీకృ తుండను గృపావ రతంత్రుఁ డటంచుఁ బల్కు నా
ర్యోక్తులు నెమ్మదిం దగుల నోరఘు వంశ శశాంక నేను నీ
భక్తుఁడ నై తరింపఁగ నుపాయ మిఁ కొండు గ్రహింప రామి, నా
శక్తి కొలంది నీసుమ మొసంగెద మంగళ మూర్తి రాఘవా!

మ. శివ చారిత్ర మటన్న, సంతస మెదన్ జెల్వారఁ గాఁ దత్కథల్
శ్రవణానంద ముగాఁగ విందు, వను ప్రాశస్త్యంబు నన్ నీకు నీ
శివ లీలాత్మక మైన కబ్బముఁ గృతిన్ జేకూర్చితిన్ భక్తుఁడన్.
భవ బంధంబులఁ ద్రెంపి బ్రోవుము కృపా పారీణతన్ రాఘవా!

గీ. తప్పు లే కలవో! లేక యొప్పు లే క
లవో! విమర్శింపఁ జాల మేల్తళుకు రన్న
నైన నొక రాజు రాయి యైనను, సమాన
భాజనముఁ గాదె? నీవృష్టి పథము నందు.

యుష్మచ్చరణదాసుఁడు.
పింగళి వేంకటనరసయ్య.

తప్పొప్పుల పట్టిక.

పేజి.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
తిసమ			
ాము			
తము	2	లవో	లవా
3	10	విభాండుని	పవిత్రుని
8	1	ఇంతకుమున్నిర్వరు	ఇంతకుమున్నిర్వురు
12	7	పూర్వపుణ్యముండి	పూర్వపుణ్యముండిన
13	19	ఆయుర్దాయువు	ఆయుర్దాయము
	24	పూజ	బూజ
26	14	సకృతాత్మ	సుకృతాత్మ
27	16	మృకండాశ్రమంబు	మృకండ్వాశ్రమంబు
30	13	స్వర	స్వర్థ
	25	బలుకుదురె ? దీనికిన్	బలుకుదురె ? దీనికింపగు
33	25	మృకండా	మృకండ్వా
36	10	గణితవరునకు	గణితవయసకు
41	2	విభాండకుమారా !	మృకండా !
47	22	సమతకంఠేశ్వరుఁడు	సమృతకంఠేశ్వరుఁడు
49	26	కికరుల	కింకరుల
54	2	మీశ్వరాధన	మీశ్వరాధీన
	3	దిపుర	ద్రిపుర
	15	ఇంకనుపోయెన	ఇంకనువాపోయెన
57	10	విచారిచెదఁబిలిపిప్రము	విచారించెదఁబిలిపింపుము
	14	వీరుగోపేత్రితలు	ఇరుగోపేత్రితలు
58	22	దారల	దారను
	25	నొప్పురా ?	నొప్పెరా ?

పేజి,	పంక్తి.	తప్పు.	ఒప్పు.
59	2	తలంచితిమో	తలంచితివా
65	21	మారేడుదళమే	బిల్వపత్రిమే
67	9	యోరీకి	యోరీరి
	14	యుమామహేశ ! నోజ	యుమామనోజ !
	15	పురష	పురుష
	18	హృదయయును	హృదయమును
	22	నీయామీటలు	నీయామాటలు
71	19	నిన్నుప్పుడే	నిన్నిప్పుడే
74	18	పీడుగో	ఇదుగో
75	11	తాపకినాను	తావకీనాను.

"శ్రీరామచంద్రపరమాత్మనే నమః"

(నాంది)

శా. శ్రీకంఠుండు సమస్తలోకజనసంసేవ్యుండు భక్తావన
శ్రీకల్యాణచణుండు మానితదయాసింధుం డుమాభర్త గం
గాకల్లోలవతీలసచ్ఛిరుఁడు మార్కండేయసంరక్షణ
స్వాకారప్రభ నిర్జితాంతకుఁడు మీ కైశ్వర్యముల్ గూర్చుతన్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి)

సూ:—ఆహా! ఏమి నాభాగ్యము.

గీ. సత్యవాక్యంబు పగిది నిష్కలుష మగుచు
సజ్జనుని మానసంబటు చల్లనగుచు
నిరుపమానంద సంధానకరణి సరణి
నలరుసభఁ గాంచ దృక్పర్వ మగుచు నుండె.

కాలహరణ మేటికి (తెరవంకఁజూచి) మారిషా! యిటురమ్ము.

మా:—(ప్రవేశించి) బావా! ఏమిసెలవు?

సూ:—సకలకలాప్రవీణు లగుసీసదస్యుల నీక్షించుచుండియు, "ఏమి సెల"వని యడుగు చుంటివా?

మా:—శ్రీతిరుపతివేంకటేశ్వరులశిష్యుం డగుపింగళి వేంకటనరసయామాత్యుఁడు రచించిన మార్కండేయనాటకప్రదర్శనమునకు, వలయుపాత్రల నలంకరింప నియమించితిరి కద?

సూ:—అగును. తగినయేర్పాటులఁ జేసితివా?

మా:—సర్వము సమకూర్చితిఁ గాని, తమచే గారవింపఁబడుచున్న, యానందుఁడు, వైరిప్రేరేపణమునఁ బ్రతికక్షి యై, మనప్రదర్శనము విఘ్న మొనర్ప యత్నించు చుండినట్లు వింటిని.

సూ:—అతఁ డట్లగువాఁ డని, యీావఱకే యెఱుంగుదును. అందుచే

తనే గౌరవించు చుంటిని. దుష్టులతోఁ గలహించుటకంటెఁ జెలిమి యొనర్చి సాధ్య మైనంతవఱకుఁ సన్మార్గమునఁ బ్రవేశపెట్టు టుచితలక్షణముగద ! కానిమ్ము యెవనిదుర్మార్గము వానినేజెరచును. ధర్మపక్షపాతి యగుభగవంతుఁడు లేఁడా? ఇంక నీ వరిగి, మృకండాదిభూమికల బ్రహ్మలోకమునఁ బ్రవేశపెట్టుము. నే నింతలో సర్వకార్యసిద్ధి కై, కవియిష్టదైవమును సంస్మరించి వచ్చెద.

మా:—చిత్తము. (నిష్క్రమించును.)

సూ:—(అంజలిఘటించి)

మ. దురహంకారరజస్తమాదిఖలచిత్తుల్ గాంచఁగా లేనిభీ
కర మై దీనజనౌఘరక్షణకళా ఖండప్రకాశంబు నై
స్థిర మై పాపలతాలవిత్ర మయి దేదీప్యప్రభాపూర్ణ మై
పరగ లోకము లేలునీకరుణ మా పైఁ జూపవే ! మారుతీ !

(నమస్కరించి, నిష్క్రమించును.)

ఇది ప్రస్తావన.

"శ్రీరామచంద్రపరమాత్మనే నమః"

మార్కండేయ నాటకము.

(ప్రథమాంకము. 1 వ రంగము.)

(సత్యలోకము, బ్రహ్మమందిరము.)

(ప్రవేశము మృకండమహర్షి, మఱియు నిద్దఱు)

(అనుబంధము-1)

ఋషులు:—(1-2 తో) (మృకండుఁడు) ఓహో ! బ్రహ్మమందిరద్వారమును సమీపించితిమి.

ద్వార—:మహానుభావు లగుసంయమీంద్రుల కభివాదము.

ఋషు:—కళ్యాణం భూయాత్

ద్వార:—మహాత్ము లరుదెంచుటకుఁ గారణ ముండకపోదు.

మృకం:—సర్వజగదుత్పత్తి, స్థితి, లయకారణభూతుఁ డగు, పరమేష్ఠి, దర్శనము ననానందించుటయె.

ద్వార:—మహాభాగ్యము. నిరాటంకముగఁ బోయి దర్శింపుఁడు

[తలుపులు దెరవఁబడును, తెల్లతామరగద్దెపై సరస్వతీచతుర్ముఖులు గోచరింతురు, వారి కెదుట నొకగంట (వ్రేలాడు చుండును)

ఋషు...సత్యలోకేశ్వరా ! వాణీమనోహరా ! నమస్తే! నమస్తే!
(అని యిద్దఱుమునులు లోనఁ బ్రవేశింతురు, మృకండుఁడుఁ జనఁబోవ, (వ్రేలాడుగంట మ్రోగును]

ద్వార:—(మృకండునాపి) మౌనివరా! క్షమించి, యిచ్చట నేయాగుఁడు.

మృకం:—(వెల్లఁబోయి) కారణ మేమి ?

ద్వార[1]:—"అపుత్రస్యగతిర్నాస్తి" అను నార్యోక్తి దామెఱింగిన దేకద? అట్టిసంతానహీను లరుదెంచి, యీపవిత్రద్వారము దాట నెంచినపు డీగంట, తనంతఁ దానె మ్రోగుచుండుటయు, మేమవ్వారి నడ్డగించుటయు, స్వభావము. ఇప్పటినినాదసూచకమున, మీరట్టి వారని, పోవల దని కోరుచుంటిమి. దయ యుంచి, తా మావలిగు మ్మముకడ నిలువుఁడు.

మృ:—(ఖిన్నుఁడై యావల కేఁగును)

బ్రహ్మ:—(లోని కేఁగినవారితో) ఓహో! పరమతపోధనులా! విచ్చేసి, సుఖాసీనులు కండు.

ఋషు:—(కూరుచుందురు)

బ్రహ్మ:—భవత్సంకల్పితసకలకార్యములుఁ జక్కఁగ నెరవేరుచుం డెనా?

ఋషి [1]:—సకలలోకకళ్యాణానుసంధాయి వగుచతుర్ముఖుఁడవు, నీవు, నీసంతతిని, సహస్రనేత్రములచేఁ గనిపెట్టుచుండఁ గొఱంతలు గలుగునా ?

బ్రహ్మ:—ఇ దంతయు ననిర్వాచ్యతపోమాహాత్మ్యము. మనీషాగరిష్ఠులుఁ గొందరు, మృత్యువు నతిఁగట్టి, బ్రహ్మానందమునఁ దేలి యాడుటకుఁ గూడ, నియ్యదియే కారణభూతము. పెక్కుయుగంబులు మార్పడినను, నిశ్చలతపస్సమాధి నుండుదేహికి మాత్రము భిన్న ముండదు. లీలామాత్రముగ నవస్థాభేద మొదవు చున్నను తుట్టతుద కట్టివారికే, మహోత్కృష్టపదవి సిద్ధించును. ఇఁకముం దును మీ కవిఘ్నమగుఁగాక.

ఋషి [2]:—భగవదాశీర్వాదము, వరప్రసాద మై విరాజిల్లును. మా కింక సెల వొసంగి, కాపాడుచుండుము.

(యిర్వురు నమస్కరించు చున్నట్లును, బ్రహ్మ యాశీర్వదించు చున్నట్లు నుండఁగ——తెరపడును)

2 వ రంగము (ప్రవేశము మృకండుఁడు.)

నుబంధము-2) కట్టా! పూర్ణసంతోషమున మిత్రులం గూడి, సముదర్శింప నేతెంచిననా కెట్టిపాటువాటిల్లె ? నేఁ డెట్టిదుర్ది ఇంతటిదురంతసంకల్పవినాశన మొదైనఁ గలదా ? ఛీ! ఛీ ! కా ! సిగ్గులేక, తగుదునని, జీవచ్ఛవంబ నై, సాటివారిలోఁ త్తి, యెట్లు సంచరింపఁ గలవు ? సతీశిష్యులమోము లెట్లు గలవు ? సత్యలోకవిశేషములఁ వినఁగుతూహల యగుసహ ణి కీదుర్భరపరాభవ మెట్లెఱింగింపఁ గలవు ? చిరతప ్యాయపరుఁడును, సకలముని జనస్తవ్యభవ్యచరిత్రుండును భాండునిపుత్రుఁడ నై జన్మించి, తాండవలీలానందహృన్మం ను, దుస్తరకలుషారణ్యవీతిహోత్రుఁడును, దీనజనావనదీక్షా ణుఁడును నగు,గిరిజామనోహరుచరణసరోజము లత్యానంద బసితనంబునుండి సేవించుచున్నను, కళంకమై, హేయమై, నమై, దుస్తరమై, దురంతదుఃఖభాజన మైన, సంతానహీనత్వ ాతకకూపంబునుండి తప్పించుకొనలే నైతిఁ గద ; (కొంచె ఓహో! ఏమి నానిష్ప్రయోజనవాక్సంధానము ? జన్మాం కృతపరిపాక మనుభవింపకమానునా ? తప్పదు. ఎంత కైన, ననుల్లంఘనీయము (ఇంచుక నే పొఁగి) ఔరా! ఎంతసరి ొనినను, బ్రహ్మను సేవించి, నా తెరం గరయవచ్చు, పుణ్యా త్రిద్వయముం గనినంతనె, వెండియు నాసంతాపాగ్ని రవు మనా ? వారినిష్కళంకదృక్ప్రసారమున, నీనాదురదృష్టశరీర ము, నిట్టనిలువున దగ్ధ మైనను మానేఁ గాని, గోరుచుట్టుపై పోటు ననుకరించు నిప్పటి మిత్రసందర్శనమునకుమాత్రము మట కష్టము. (తెరలోఁజూచి) సహవాసు లరుదెంచు చున్న ఓహ్హృదయమా! నీ వింకనుఁ బగుల కుంటివేమి.

(అనుబంధము-3) (నిష్క్రమించును)

3 వ రంగము (అరణ్యము, మృకండాశ్రమము మరుద్వతి, శిష్యుఁడు గూరుచుండి యుందురు)

శిష్యు:—అమ్మా! కురంగపోతముల కాహార మొసంగి వచ్చెదను

మరు:—పోయి రమ్ము.

శిష్యు:—(నిష్క్రమించును)

మరు:—(లేచి, యాశ్రమముఁ బరికించి) కట్టా! నాథుఁడు లేనికతంబ మెంతశోభావిహీనముగ నున్నది?

సీ. అరవిందబాంధవుం డపరవారిధిఁ గ్రుంకఁ
గళలేనిపద్మినీ కాంత సరణి
కీరమ్ము లేకశృంగారమ్ముఁ గోల్పోయి
పరికింపరాని పంజరము కరణి
శతపత్రయుగ సరోజము లేక వెలవెలఁ
బారుచుండెడిసరో వరముభాతి
నాయకమణి లేక హేయ మై కనుపట్టు
రతనాలతార హారంబు లీల

గీ. పల్లవము లేనిమందార వల్లి పగిది
రసము లే నట్టి కావ్యంపు రచన యట్లు
ప్రాణపతి బ్రహ్మ సేవింప నరుఁగు కతన
బాడువారిన దయ్యె నీ పర్ణశాల.

(నిట్టూర్పు పుచ్చి) అబ్బా! ఏవియోగమైన భరింపఁ వచ్చుఁ గాని, పతివియోగము దుస్సహము. మఱియు,

మ. అతిభాగ్యాంచిత మైన వంశమున జన్యంబై నఁ గానీస మా
హితశుద్ధాంత నివాస మబ్బిననుఁ గానీ రూపరేఖాకళా
న్వీత యంచు న్నుతి కెక్కఁ జాలిననుఁ గాని శ్లాఘ్య మై తాఁబతి
వ్రత కాకుండిన నట్టిసంపదలసత్వం బెల్లఁ శూన్యంబగుర్.

అని వచించు ధర్మశాసనతానిబద్ధమానస నగు నే నేరీతి సైపఁగలను? చతురాననదర్శనోద్భూతపరమసంతోషస్వాంతుఁడగు, ప్రాణేశ్వరుఁడు వచ్చు నంతదనుక నేమునిపత్నులతో నైనఁ గాలముఁ గడపుద మన, సమీపాశ్రమము లరుదయ్యె. సత్సహవాసమున కై దూరమును లెక్కింపక, యుటజమును విడిచి పోవుద మనిన, భాగ్యవశమున నేయభ్యాగతి యైనఁ జనుదెంచి, కుటీరమున నెవ్వరుఁ గానరామి, వేఱొకచోటి కరగిన, తదాతిథ్యసత్కార్యాచరణమునకుఁ వెలి నై, గృహస్థాశ్రమధర్మోల్లంఘనమహాపాపఫల మనుభవింపవలసినదాన నగుదుఁ గాన, నాథునిరాకకు క్షణములు లెక్కించుకొనుచు నీవన్యమృగములతోడనే కాలముఁ గడపెదఁ గాకఁ [కూర్చుండఁబోయి, నిరూపించుచు] ఆహా! ఏమినాభాగ్యము! ఎవరో ఋషిసువాసినులు, యీమార్గమున నేదయచేయుచుండిరి; వీరి కాతిథ్య మొసఁగి, కృతార్థురాల నయ్యెద.

(ప్రవేశము, మునికాంత లిర్వురు)

ము. కాం:—(1) అక్కా! ఇది యొకమున్యాశ్రమమువలె నున్నది! ఇందలి సాధ్వి నడిగి, దాహశాంతిఁ జేసికొందము రమ్ము.

(2) మంచిది (సమీపించుచుందురు)

మరు:—(ఎదురుగావచ్చి) అక్కలారా! విచ్చేసి, యీవ్యాఘ్రాజినము నలంకరింపుఁడు.

(1) (2)[కూరుచుండి] చెలియలా! నీవునుఁ గూరుచుండుము.

మరు:—[కూరుచుని] [అనుబంధము—4] లతామతల్లుల కెన యగు తాము, కడు బడలిన ట్లుంటిరి! తాళవృంతముతో, నించుక విసరెద. విశ్రమింపుఁడు.

ము. కాం:—[2] సోదరీ! ఇచ్చటిలతావితానము లే శ్రమ నపనయింపుచున్నవి. కొంచెము దాహ మగుచున్నది. మంచినీ రొసఁగుము మా కంతియే చాలును.

మరు:—అలాగే యిచ్చెదను [అనిజలములఁ గొనివచ్చి యిచ్చును]

ము. కాం:—[1] అమ్మా! నీనాథుఁ డెం దరిగె?

మరు:—పరమేష్ఠిని సందర్శింపసత్యలోకమున కరిగిరి.

శిష్యు:—[ప్రవేశించి] అమ్మా! హరిణములఁ గడుపునిండ మేపి వచ్చితి.

మరు:—మంచిది.

ము. కాం:—[1] అమ్మా! ఈతఁ డొక్కరుఁ డే కుమారుఁడా?

మరు:—[చిన్నబుచ్చుకొని] అమ్మా! నే నంతటిభాగ్యమునకు నోచుకొన నైతి నితఁడుఁ బుత్రప్రతిమానుఁ డగు' శిష్యుఁడు.

ము. కాం:—1-2 (జలపాత్రల దిగవిడచి, లేచి) ఏ మేమి ? నీ వనపత్యవా ? ఎంతభాగ్యమున్నను, యెన్నిసంపదలున్నను, యెంతటివిద్యాబలపరాక్రమము లున్నను, యెంతసత్కర్మానుష్ఠానతత్పరు లైనను, సంతానహీను లైనచో నవన్నియు, నా నావిధకీచకగుల్మలతాతరువితానఘోరారణ్యప్రదేశమునం బ్రసరించు చంద్రకిరణములభాతి నిష్ప్రయోజనం బగు. అట్టివారిచేతినుండి, తృణ మేని గ్రహింపఁ దగదు. (నీటిపాత్రలఁ జూపుచు) కలశములఁదీసి జాగ్రత్తఁబెట్టుకొమ్మా. [యిరువురునిష్క్రమింతురు]

మరు:—(నిర్ఘాంతపడి జూచి) [అనుబంధము-6] ఆహా! ఎంతపరాభవము! సాటివారిలో నా కెంతచిన్నతనము! గొడ్రా లనునీచవాక్యమున కే నెట్లునైపుదు? అయ్యో! సహింపక చేయున దేమి?

చ. పడతుక కేలచోఁ బుట్టుటయె పాపము పుట్టినఁ గొడ్డురాలుగాఁ
బుడమిఁ జరించుకంటె వన భూమినిఁ దా నొకమోడు మ్రాకుగాఁ
బడుట సమంజసంబు జనవందుఁ డు గాఁడె మృకండుఁడన్న పే
ర్వడసిన వానిభార్య కిటు వంత ఘటిల్లె నిఁ కేమి సేయుదుర్.

కట్టా! నాయీకళంక మెంతవిచారముఁ గూర్చు చున్నది! దాహబాధచే నీమునిపత్నులు మాయాశ్రమమున కరుదెంచుట సంతోషమే యైనను గుశలప్రశ్నల నామానసముఁ గలఁగించి, కడునీచురాలవని, జలంబులఁ బరిత్యజించి పో నేల ? ఈఘోరనరకకూపమునుండి

తప్పించువా రెవరు? ఔరా! పరమేశ్వరులీల లెంతమరవగాహము లు, ఎంతచిత్రములు.

(అనుబంధము-6)

శిష్యు:—అమ్మా ! అలవిగానిదాని కై విచారించినఁ బ్రయోజనమేమి? నేఁ జని, పూజాద్రవ్యములఁ గొనివచ్చెద, దేవతారాధనకు సమయ మగుచున్నది.

మరు:—బిడ్డా ! కొనిరమ్ము.

శిష్యు:—[నిష్క్రమించును]

మరు:—ఇఁక విచారించిన లాభ మేమి? నాథుని యాగమనమునకు నిరీక్షించుచుఁ, నిష్టదేవత యగు, గౌరినిఁ బూజింప నేఁగెద. (అని వెళ్లఁ బోయి, ధ్వని నాలించుట నటించుచు) ఆహా ! ఎచ్చటనుండి యో, విచారగ్రస్త మగు, కంఠరవము వినఁవచ్చుచున్నదే! (చూచు చుఁడ)

మృకం:—(ప్రవేశించుచు) (అనుబంధము-7)

మరు:—(సంతోషాశ్చర్యఖేదములతో) అయ్యో ! ఇ దేమి ? దేవా! పరమేశ్వరసేవాసముత్పన్నసకలకళావిభాసురం బగుభవన్ముఖచంద్ర మండలము, శోభారహిత మై యుండుటకుఁ గారణ మేమి ? యీ విచార మేల ?

మృకం:—(స్వ) కష్టా ! ఏ మని వచింతు ?

మరు:—ప్రాణేశ్వరా ! మాటాడ రేమి? సత్యలోకమున కరుగ రైతిరా?

మృకం:—సతీ ! పోయితిని. ఫల మవాచ్య మై చిత్తసంక్షోభకారణ మైనది.

మరు:—(తనలో) కటాకటా ! ఇచ్చట నా కేకారణమున సంతాప మయ్యెనో, యాకారణమున నే, జీవితేశ్వరున కానన్నిధానమునఁ బరాభవము సంభవించి యుండునా ? (ప్రకాశముగ) నాథా! దైవవిధి మనల నిర్వ్యర బాధించుచున్నది. మనపూర్వజన్మకృతదో

షమునఁ గదా! సంతతిలేనివార మైతిమి. ఇంతకుము న్నిర్వురు ము నిపత్నులు, మనపర్ణశాల కేతెంచి, మంచినీ రిమ్మని, కుశలప్రశ్నల చే గ్రహించి, గొడ్డురాలిచేతి పూరిపుడక యేని గైకొనఁ దగదని, జలములఁ బరిత్యజించి పోయిరి. నే నాపరాభవమునఁ గుందుచుఁ దమరాక కెదురుచూచుచుండ నా యభాగ్యదేవత మీకు నైతముఁ దటస్థ మగుట, దురంతదుఃఖభాజన నై యున్నది. మన కింక గతి యేది? ఎవరు దిక్కు ?

మృకం:—కష్టా! నేఁటికి మనయాశ్రమ మెంతవిచారగ్రస్త మైనది! (భగవంతు నుద్దేశించి) ఓ సర్వేశ్వరా! శంకరా! దీనబంధు! నేను నీదాసానుదాసుఁడ నై, నీవే యేడుఁగడ యని తలంచి, నిశ్చ యమానసుఁడ నై, భజించు చుంటినే! యీదు స్తరకలుషవారా శినుండి తప్పించుకొనుమార్గ మేద్ది? నీకన్నమాకు వేరుగతి కలదా?

మ. కరుణాలేశము లేదె? భక్తుఁడను నేఁ గానే? ననున్ బ్రోవగా
భరమంచుఁ ద్యజియించితే? జగములన్ బాలింప నీవే కదా?
కరిచర్మాంబర! నాగభూష! హర! గంగాసంగమో ల్లాస! మా
దురితంబుల్ దొలగింపవే! యొకసుపుత్రుం గూర్పవే! యీశ్వరా!

మరు:—నాథా! మనల నీయాపదనుండి దరిఁజేర్ప, నేమహానుభావుఁ డైన దయచేసి, తరణోపాయ మెఱిఁగించిన సంతస మగునే! అవి యు, నరు దయ్యెఁ గద ?

మృకం:—(ఆలించుట నటించి) ప్రాణేశ్వరీ! ఎచ్చటనుండి యో, మహ తీనినాదము వినవచ్చు చున్నది. దేవర్షి యగు, నారదుఁడు త్రిలో కసంచారి యగుట, వియన్మార్గగామి యై, యెచ్చటికోఁ బోవుచుండ నోపు.! భాగ్యవశమున నిటు రాఁగూడదా ?

మరు:—అయ్యో! మనకంతటి యదృష్టమా? (అని యిర్వురు బయ లాలకించుట నటింపు చుండ)

శిష్యు:—(పూజాద్రవ్యములఁ గొనిప్రవేశించి) గురువుల కభివాదము.
మృకం:—దీర్ఘాయురస్తు.
శిష్యు:—(లోపలి కేఁగి, పూలబుట్ట నందుంచి వచ్చును)
నార:—(ప్రవేశము) (భజగోవిందం)
మృకం:—వందే హం సన్మునిపవిత్రచరణం (నమస్కరించును)
మరు:—మహాత్మా! నమస్కారము.
నార:—సుపుత్రావాప్తి రస్తు.
మృకం:—దయచేసి, యీకృష్ణాజిన మలంకరింపుఁడు.
నార:—శ్రీమన్నారాయణ! నారాయణ! (అని కూర్చుండును)
మృకం:—(కూర్చుండును)
మరు:—(నిలుచుండును)
మృకం:—దేవర్షిసత్తమా!

చ. అమలచరిత్ర! మీరలు మ దాశ్రమ భూమిని జేరవచ్చుటన్
మముఁ గృతకృత్యులన్ సలుప మానసమందుఁ దలంచి రంచు నెం
తుము భవదీయదర్శనము తోడనె ధన్యతఁ గంటి మయ్య! మా
తమము లడంగిపోయెఁ వసుధాస్థలి వార్త లెఱుంగఁ దెల్పుఁడీ!

నార:—"వసుధాస్థలిఁ" యన నేల? ముల్లోకంబులఁ గలవార్త లెల్ల నీయుల్లంబు పల్లవింపఁ దెల్లం బొనర్చెద నాలింపుము. సిన్నటిదిన మున, విధాతృసదనమ్మున కరిగి, ప్రసంగవశమున విశేష మరసి, పిమ్మట, మృకండునకుఁ గతియేమని, సృష్టికర్తను బ్రశ్నించితి.
మృకం:—మహాత్మా! కమలగర్భుఁ డే మని యాన తిచ్చెను?
నార:—"వారణాశికిఁ జని, గృహిణీసమేతముగ, మణికర్ణికాఘట్ట మున, గౌరీ, శంకరులఁ గూర్చి తపం బొనరించినచో, నర్ధనారీశ్వరుఁ డుఁ బ్రసన్నుఁ డై, సుపుత్రు నొకని బ్రసాదించు" నని నిరాఘా టముగ వాక్రుచ్చె నంతఁబిత మహు నాజ్ఞఁ గైకొని, నీ కీవార్తఁ దెలియఁ జేయుట కీమార్గమునఁ వచ్చితిని.

మృకం:—ధన్యోస్మి! ధన్యోస్మి! మహాత్మా! తమపరోపకారపారీణత నెంతయుఁ గొనియాడెద.

మరు:—సదయాత్మా! మణికర్ణికాఘట్ట మంతటిప్రభావము గలది కాఁబోలు! లేకున్న నిమిత్తమాత్రముగ, "వారణాశి" యనియే సెలవీకుండునా?

నార:—సాధ్వి! విపులముగవర్ణించిన, నొకగొప్పగ్రంథము కాగలదు. బ్రహ్మాదులుఁ దత్సరోవరస్నాన మాచరించి, నిశ్చలతపంబుఁ జేసియే భువనములఁ సృష్టింపఁ బెంప, హరింప సమర్థులైరి. కావున మీరింక వేగిరంపడి, కర్తవ్యమున కుపక్రమింతురు గాక

మృకం:— మరు:—	మహాభాగ్యము.

నార:—నే నింక నాయాశ్రమమున కేఁగెదను, మీరు రేపటియుదయమ్మున నే పయన మగుఁడు.

మృకం:—చిత్రము! వెండియుఁ దమదర్శన మపేక్షింతు.

నార:—అలాగుననే! మీపుత్రునిజిలిబిలిపల్కు లాలింప విచ్చేయకుందునా? (అని వెళ్లుటనటించును) (భజగోవిందం)

మృకం:— మరు:—	(సాగనంపుట నటింతురు, తెరపడును)

"శ్రీరామచంద్రపరమాత్మనేనమః"

మార్కండేయనాటకము.

ద్వితీయాంకము. 1 వ రంగము.

కాశీకాపురవీధి

(ప్రవేశము భట్టోజీదీక్షితులు)

భట్టో- శ్లో॥ వందే శంభుముమాపతిం సురగురుం వందే జగత్కారణం
వందే పన్నగభూషణం త్రిపురభిత్ ఫాలాగ్ని నేత్రోజ్వలం
వందే భక్తజనావనం శశిధరం వందే ముకుంద ప్రియం
వందే దేవకిరీటకోటివిలసత్పాదారవిందం శివం.

(ప్రవేశము వేంకటచైనులు)

వేంక:—(స్వ) వృద్ధజంబుకమువలె నీభట్టోజీదీక్షితు లెచ్చటికో వెళ్లుచున్నాఁడు. ఎప్పుడు చూచినా ధనార్జనప్రయత్న మేకాని యితరవ్యాపారములేదు సంతానమా, చట్టుబండలా! ఎవరుతినను! శవవాహక సంపాదనబాపతు రెండులక్షలు, నీటికాసులుతాలూకు లక్షాయేంబదివేలు, పూడ్చిపెట్టి పొట్టనిండ గూడైనఁ దినక, యీమట్టముధ్యాహ్నమునఁ గ్రిందఁగాళ్లు, మీఁద నెత్తి కాలుచు నుపాదానమునకై బయలు దేరకున్న, వీని కేమి మునిగినది?

భట్టో:—(కళ్లబొట్లు తుడుచుకొనుచు సమీపించి) ఎవరు నాయనా? వేంకటావధానులా యేమి?

వేంక:—అవధాని కాదు! చైనులు.

భట్టో:—నీవా! రామసోమయాజుల బిడ్డవా?

వేంక:—ఆ! అగును. అయితే, తాతా! ఇంతయెండలోకూడఁదిరగట మెందుకు. ఆకూడఁబెట్టినది చాలదా? ఇఁక నీవృత్తి మానరాదా?

భట్టో:—అగునుకాని అలవాటు వదలితే తోచదు బాబు!

వేంక:—తోచకుంటే కులాచార మగుతపస్సుఁ జేసికొనరాదా? దానివలన, పూర్వపుణ్యముండి, సంతాన ముదయించి సద్గతిఁ జేకూరునే!

భట్టో:—ఓరి! వెఱ్ఱివాఁడా! యింకను సంతానాపేక్షయా? సరిసరి!

వేంక:—నేనువెఱ్ఱివాఁడనుఁ గాను! చూడు మామణికర్ణికాఘట్టమున మృకండమరుద్వతులను మునిదంపతులు నీకంటె వయోవృద్ధులు, సంతానాపేక్షచేఁ దపోనిష్ఠాగరిష్ఠులై, యీశ్వరు నారాధించు చున్నవారు. ఎక్కడనో మునిపల్లెయం దుండువారే యిచ్చటకురాఁగా నూరిలోనివాఁడవుఁవారికన్నఁజిన్నవాఁడవునీ వుపేక్షించుట మంచిదియా?

భట్టో:—అయితే! వారిసంగతి నీ వేలాగ్రహించితివి?

వేంక:—విశ్వేశ్వరార్చకునిభార్య చెప్పిన దని మాయింటిది నాతోఁ జెప్పినది.

భట్టో:—అంతేనా? నీవు చూడలేదుగా!

వేంక:—అవ్వతోకూడా! నీ వాయువ్యమమున కుపక్రమించిన నేనే చూచి వచ్చెదను.

భట్టో:—ఇదుగో నోయి! దీని కేమి! నన్ను "తాతా" అనినను, మాయింటిదాన్ని, అవ్వనకుసుమా! విన్నదా మాట దక్కదు.

వేంక:—అయ్యబాబో! నీకన్నముసలిదిలా గగపడునే, అంతకోపమా? ఆలాగైన, కోపి కోపిక యుండదు! అదిలేకున్నఁ దప మాచరించుట కష్టము ఆచరించినను, సిద్ధింపదు! రా! రమ్ము! ఇంటికిఁబోవుదము.

భట్టో:—నే నాలావెళ్లి రెండుమూఁడుగడప లెక్కినం గాని చెంబు నిండదు. నీవు పద.

వేంక:—మంచిది (నిష్క్రమించును)

భట్టో:—తప మట, వీడిమొగ మట, సంతాన మట; ఒకవేళఁ గలిగినను నే నింతకష్టపడి యార్జించినది వాఁ డేదురభ్యాసమున నాశనముఁ జేయునో, తద్వారా పితృదేవత లధోలోకముపాలు గావలసివచ్చును. సంతానము లేదువిధము లు గాన నాయవసానకాలమున కున్నధనములో నేఁబదివేలు భార్య కుంచి, మిగిలినది యేభారతీయవిద్యాలయాదుల కైన నిచ్చిపోయెదను. (నిష్క్రమించును)

(ఇదివిష్కంభము)

(తెర యెత్తఁగా, మణికర్ణిక, యీశ్వరధ్యానముఁ జేయుచున్నమృకండమరుద్వతులు నమస్కరింపుచుఁ గనిపింతురు)

మృకం:—శంభో! సకలాభీష్టప్రదా! గౌరీరమణా! పాపహరణ!

మ. కరుణాలంకృతమానసాంబురహా! శ్రీకంఠా! సదానంద! దు
స్తర దుర్వారభవాంబురాశితరుణా! సద్యోగ సంపత్కరా!
గిరిజేశా! త్రిపురాసురాంతక! మహాగ్నిజ్వాలికానేత్ర! నీ
శరణంటిన్ నిజ భక్త పోష! సకలైశ్వర్యాకరా! శంకరా!

(గౌరీశంకరులుఁ బ్రసన్ను లగుదురు)

శంక:—ఓపుణ్యదంపతులారా! మీనిశ్చలతపంబున కానందభరితుల మైతిమి! మీ రర్థించినపుత్రుఁడు దీర్ఘాయుర్దాయువుగలదుర్గుణుఁడు గావలెనా? అల్పాయుష్కుఁ డగుసుగుణుఁడు గావలెనా? కోరికొనుఁడు.

మృకం:—దేవాదిదేవా! సకలలోకశరణ్యా!

మ. చిరకాలంబుననుండి సంతతికి నై చింతించి చింతించి త్వ
చ్చరణాబ్జంబుల పూజ సల్పి ఖలు నే చందంబునన్ గోరుదున్
దురితున్ గాంచె మృకండుఁ డంచు జనముల్ దూషింప నెట్లోర్చెదన్
మొరకుంబుత్రుఁడు వంశవృక్షమును నిర్మూలంబు గావింపఁడే?

శంక:—అటు లేని, మహోన్నతగుణగణాలంకారుండును పదియార్వత్స
రముల కతిక్రమించని వయఃపరిమాణుండును నగు వాని నొసంగితి.

మరు:—(ఖేదామోదములతో) కట్టా! మాయానందకాల మెంతస్వల్ప
ము? అయిన నీజగజ్జనని నిట్లు వేడుకొనియెద. (ప్రి)ఓతల్లీ? దీనజన
కల్పవల్లి?

గీ. గొడ్డురా లనుమాట కేఁ గుందికుంది!
ప్రాణములువోక జీవచ్ఛవంబ నగుచుఁ
గడకు నీదయఁ బుత్రునిఁ గాంచినజల
జనని,యల్పాయువున కయి, యడలఁ గలనె !

గౌరి:—సాధ్వీ! నారు వోసినభగవానుఁడు నీరు వోయకుండునా? ఇప్ప
టి కొం డెద్దియుఁ గోరకుము.

మరు:—మహాప్రసాదము (మృకండమరుద్వతులు శిరములు వంచి నమ
స్కరింతురు.) తెర వాలును)

(అరణ్యమార్గము) (ప్రవేశము నారదుఁడు)

నార:—(భజగోవిందం) ఔరా! పరమేశ్వరునిమాయ దెలియుట దుస్సా
ధ్యముగద! ఎంతకాల మెవ్వరి నేమనోవ్యాకులతచేఁ గృశింపఁ జేయు
నో! ఎవ్వరి నేవిధమున సంతోషసాగరమ్మున నోల లాడించునో,
తెలియనీక, రాత్రింబవళ్లవోలె నాయాకష్ట సుఖములను, హఠాత్సం
భవములుగ, సమకూర్చు చుండును. అటులే కాకున్న, మొన్న మొ
న్నటివఱకు, సంతానహీనతచేఁ బరితపించినమృకండమరుద్వతులకు,
పుత్రప్రాప్తియగునని యెవ్వ రేనిఁ దలఁచిరా? ఇది దైవయోగ
ముగాక యితరమగునా? కాని, పాప మాతనయునకు షోడశవత్సర
ము లే జీవితకాల మగుటకు విచారింపవలసె నిట్టిపాటునకుఁ బూర్వ
జన్మకర్మము కారణముగాఁ నుండవలయు లేదా యేతత్పరిమాణ
మునకు గోప్య మగుభావ మే దేని యుండ నగు నంతియె కాని,

తనభక్తులును, వృద్ధులును, జిరకాలమునకు సంతానోదయమున నానందించువారును, నగుమునిదంపతులను, వెండియు దుఃఖింపఁజేయుటకు, గౌరీవరుం డంత నిర్దయుఁడా? కాఁడు! కావున నేనీవిషయమున నిశ్చయము తేలువఱకు, నోపినకొలంది శ్రద్ధతో విచారించి, నారదుఁడు, కలహాభోజనుఁ డే గాక, భూతదయాపరుఁ డనికూడఁ గీర్తివహింపవలయు. లిఖిత ముండె నేని, యీసందర్భమునఁ గడుపునిండ భోజనముగూడ సమకూడును. నేటి కింక నాయాశ్రమమున కేఁగి, కర్తవ్య మాలోచించెద. శ్రీమన్నారాయణచరణారవిందధ్యానానందమానమానసుఁ డగు నీదేవర్షి వాంఛితములు నెరవేర కుండునా? కానిమ్ము. (భజగోవిందం)

(మృకండునివర్ణశాల, మరుద్వతీమార్కండేయు, శిష్యులతోఁ గూర్చుండి యుండఁ దెరయెత్తఁ బడును)

మృకం:—మరుద్వతీ! ఋషిసాంప్రదాయవిరుద్ధ మగు, ప్రేమానుబంధమునుబట్టి, నేను సైతము విడచి యుండఁజాలను; కాని, "గురుశుశ్రూషయా విద్యా"యను నట్లు గొంతకాల మైన గురుకులవాసు నొనర్పినం గాని యుత్తమము గాదు. న యొద్దనే చదివింతమన, లేకలేక జన్మించినతనయుఁ డగుట, భయభక్తులతోఁ జదివించుటకు, మోహావును నదభ్యంతరము పెట్టును. భయరహితులకు నిర్దుష్ట మగువిద్యాగంధ మలవడదు. అందుచే, నామిత్రుఁడును, సర్వశాస్త్రపారంగతుఁడును, నగు, కణ్వమహర్షికడఁ జదివించుట సమంజసము. తదాశ్రమ మిచ్చటి కనతిదూర మే యగుటవలన మన మప్పు డప్పుడు చని, చూచి వచ్చుటకును, అనధ్యయనదినములలోఁ గుమారుఁడు వచ్చి పోవుటకును, వీలుగ నుండును. ఇఁక సంకోచింపకుము.

మరు:—చిత్తము. నేను రెఱుంగని యంశముఁగలదా?

(ప్రవేశము కణ్వుఁడు)

మృకం:—ఓహో! ఏమి నాభాగ్యము. నామస్మరణమాత్రమున దర్శన మలవడుట కెంతయు సంతసించెద. (చేతఁజూపి) ఈవ్యాఘ్రాజినము పై విశ్రమింపుము.

కణ్వు:—(కూరుచుండి) మిత్రమా! మృకండా! పరమేశ్వరసాక్షాత్కారధన్యతముఁడవు, నినుఁ గనవచ్చుట యబ్బురమా? (మార్కండేయుని జూపుచు) ఇతఁ డేనా? శంకరవరప్రసాది!

మృకం:—(కుమారునితో) బాబూ! తాతగారికి నమస్కరింపుము.

మార్కం:—(కణ్వుని డాసినమస్కరించును) (అనుబంధము 12)

కణ్వు:—శుభం భవతు! శుభం భవతు (అని దగ్గఱకుఁ దీసికొని) నాయనా! ఈశ్వరదత్తుఁడ వగుటనీయాశ్లేషణ మమందానందదాయకమై వెలయు చున్నయది (మృకండునితో) వయస్యా! నారదునివలన సర్వ మెఱింగితి, భగవానుఁ డిం కే మాజ్ఞ నొసంగెను?

మృకం:—ఆజ్ఞలమాట యటుండఁగ ఆహా! యే మాపరమేశ్వరునిదయార్ద్రస్వాంతము! యే మాభక్తవత్సలత! సాక్షాత్కారసమయనిరుపమానంద మిప్పటికినిఁ బులకాంకురితశరీరుఁ గావించు చున్నది వినుము.

సీ: మగ్ధసా థోధిముద్దుల పట్టి రేఖా శశి
ఘనజ టాజూటాట వినీ వెలుంగ
విమలీ కృతా ఘౌఘ విష్ణు పాదో ద్భవి
జాహ్నవీ దేవి శీర్షమునఁ గులుక
సకలలో కాలోక సంస్తూ యమాన రు
ద్రాక్షలు భూతి దే హమున మెరయ
నగణిత గుణరాశి జగదంబ శాంకరి
ప్రీతితో వామాం క పీఠి నుండ!
గీ: పృథిత గజచర్మవసనధా రణముతోడ
డంబుమీరు త్రిశూలహ స్తంబుతోడ

భక్తసంత్రాణశీలత త్వరతతోడ
హరుని కనులారఁ గంటిమి యార్తిఁ దీర.

త్రుఁడా నీవాక్యములచే నా కిప్పుడు సాక్షాత్కరించిన ట్లు
భవదానందమునకు మేర యున్నదా? పులకాంకురమాత్రి
ము. చైతన్యముం గూడఁ దొలంగించుచు. ఇన్నెంతకాలముప
ు దనివి తీరదు. న న్నెందులకు దలపెట్టితివి?

శిక్షాపక్షఫల మగు నీచిఱుతని నీయొద్ద విద్యాభ్యాసునిఁ
నెంచితి; నందు కై.

ంచిది! ఇది కడుయోగ్య మగుసమయము! నా వెంటఁ గొం
ఁ బంపుము.

కుమారుని దగ్గఱకుఁ దీసికొని) తండ్రీ! "విద్యావిహీనః పశుః"..
ద్దలు వచింతురు కాన కొంత కాల మీగురువులకడఁ జదువు
వవా?

-జనకా!

జగతి జన్మించి మానవ జాతియందు
మౌఢ్యమున మని యుంట, స మంజసంబె?
కాన నీదేశికుని సన్నిధానమందుఁ
జదివి వచ్చెదనయ్య! ని స్సంశయముగ.

(దగ్గఱకుఁ దీసికొని) నాయనా! మే మప్పు డప్పుడు వచ్చి చూ
చుము. గురువులయాజ్ఞ నైనప్పుడు సహవాసునితో నీవు
దవుగాక పోయిరమ్ము.

-తండ్రీ! నమస్కారము. తల్లీ! నమస్కారము. నన్ను దీవిం
ండు.

సకలవిద్యాపారంగతో భవ.

పోయి నాయనా! (మృకండమరుద్వతులతో) ఇఁక మీ
మే మేఁగి వత్తుము-- (తెరపడును)

(ప్రవేశము. ఋషికుమారు లిర్వురు)

(1 మైత్రేయుఁడు. 2 శారద్వతుఁడు)

శార:—మైత్రేయా! మార్కండేయుఁడు, శంకరవరసంభవు డగుటఁగాఁ బోలు నక్షరాభ్యాసమైనది తడవుగఁ శాస్త్రిచర్చలందు నెవ్వరికి నంద కున్నవాఁడు. దైవకటాక్ష మెంతకైనఁ జాలినదేసుమా!

మైత్రే:—సందేహమా! కాని, యీతనిమనోనిరూఢతఁ గనుగొనవలయు నని నా కించుక యూహ జనించు చున్నది. అందుచే నేటికుశాసంగ్రహణసమయమున నేను, విష్ణువే మహోత్కృష్టుఁడనియు శివుఁడు సామాన్యుఁ డనియుఁ నిమిత్తమాత్రముగ నుపన్యసించి, అందుపై హృదయముఁ గనుగొనియెద.

శార:—అతఁడు, జ్ఞానసంపన్నుఁడు. అందుచే, శివకేశవులకు భేదముఁ గల దనుట కంగీకరింపఁ డని తోఁచెడిని.

మైత్రే:—అట్టి యభేదసాంప్రదాయము, మనము నైత మెఱుంగమా? అయినను, మార్కండేయుని యభిమతముఁ గూడ, నతనినోట వినుట కెట్లుండునో యని.

శార:—ఇంతకంటె, నీశ్వరతత్వమును గురించి యుపన్యసింపు మని కోరుట సమంజస మేమో?

మైత్రే:—ఒకనిమనోవ్యక్తిఁ బయల్పరచుటకు, యుక్తిప్రయోగ మే ముఖ్యముగద?

శార:—సరి యే కానిమ్ము. పూజాద్రవ్యములఁ గొని రాఁదగిన సమయ మగు చున్నది పోవుదము. (నిష్క్రమింతురు)

(విపినవాటిక; ప్రవేశము; మార్కండేయుఁడు, శారద్వతుఁడు, మైత్రేయుఁడు, గాలవుఁడు.)

(అనుబంధము-1 చూ)

మైత్రే:—ఆహా! ఆవటపత్రము లెంతయానంద మొసఁగుచున్నవి, కావుననే, శ్రీమహావిష్ణు వీ యాకుపైఁ బరుండి సప్తమహర్షులచేఁ

గొనియాడఁబడియె. శివుఁడు శివుఁ డనుట యే గాని, ప్రేతభూములం దక్క, నిట్టిమనోహరతలమున నెన్నఁ డేని నివసించెనా?
ల:—రమారమణుపైఁగలప్రేమ, సుమారమణుదూర నగునా?
తే:—తూలనాడు టే మున్నది? బుడబుక్కలవేషము, సతీవిసర్జనము, పులికలాపము, పునుకమాల, భిక్షుకత్వము. శిరస్తటగంగాప్రశంస మున్నగున వెవ్వ రెఱుంగరు? యథార్థముఁబలుకుట తప్పగునా?
ర్కం:—(ఆనందమున నవ్వుచుండును)
ల:—మార్కండేయా! వింటివా? శివతిరస్కారము. దీనికి నీ వేమందువు?
ర్కం:—ఏమందును! అమితానందము నొందుదును. ఏల నన దూషణచేఁ గాని, భూషణచేఁ గాని, భగవన్నామోచ్చారణ మొనరింపుట యే గద! ముఖ్యము. అందు, శివ,కేశవుల నిర్వైర నానేకాలమునఁ దలంచుటచే, మఱియు సంతోషము. ఒకవేళ నీవనినట్లు నిక్క మగుదూషణ యే యనుకొనుటకు, లోకపావనుం డగుశంకరునిపవిత్రతరము లగుచర్యల నే వక్కాణించె గాన నట్టి యవకాశ మణుమాత్రమును లేదు. రక్షకుఁ డగుశంకరుఁడు, గజచర్మ వసనధారుఁడై, భృంగీశ్వరాదులఁ బురస్కరించుకొని కైలాసాచలోన్నతప్రదేశమునఁ దాండవకేళి యొనర్చినప్పుడు, తన్మహేశ్వరకరాలంకృతం బగు, బుడబుక్కలడక్కివంటి, ఢమలకమునుండి జనించిన శబ్దములం బట్టియే, పాణినీయుఁడు మొద లగుధీవిశాలురు, శబ్దశాస్త్రముల రచించి, భాషాప్రపంచమునకు మే లొనరించిరి. కావున, బుడబుక్కలవేష మొక్కటియే జగంబుల కింతటిమహోపకార మొనర్చ, నీకుఁ దక్కుంగలశివలీల లెంతజగదుద్ధారణకారణంబు లగునో యూహింపుము! ఇయ్యది కౌముద్యాదిగ్రంథపఠనప్రారంభమునమనము చదివినదే కద! ఇది యిట్లుండ ‚‚శివాయ విష్ణురూ

పాయ, శివరూపాయ విష్ణవే' యని వేదములుద్ఘోషించుచుండ నదిగు ర్తెఱుంగక భిన్నాభిప్రాయులై గొందఱు చెడిపోవుచుండిరి. కాని, మన మామార్గ మవలంబించక పెడత్రోవలం జను వారల నీమార్గమునం బ్రవేశింపం జేసి, సంఘీభావమున మెలంగుట పరమోత్తమము. అట్టియైక్యస్థానమే ప్రణవము. అదియే సర్వశక్తిస్వరూపపరబ్రహ్మ మని పేర్కొనంబడుచున్నయది. సంఘీభావశూన్యుని చిత్తము, నిర్మలినముగా నుండం జాలదు. కల్మషహృదయమే పాపకార్యాచరణములకు మూలకందము. అట్టివానిని భగవంతుండు విశ్వసింపండు. "ఐకమత్య" మనుమహాయుధము ధరింపకున్న, భగవత్కార్యములు గాని, దేశవిషయములుగాని, వంశమర్యాదలు గాని, చివరకు బహుస్వల్ప సుగుస్వవిషయముం గాని, నెగ్గించుకొనుట కష్టము. గావున, నీతని నే నేమియు, ననుటకుసమర్థుడం గాను. ఒరులుం బ్రేరేపించిన నొడంబడను! అట్టియగత్యమును, లేదు! నీయందు, నాయందు నితనియందు సకలభూతములందు, సంపూర్ణముగ నిండి యుండి ప్రకాశించువాం డొక్కండే యగుట నిశ్చయము. నిర్ధారణము. నిస్సందేహము. ఇది యంతయు నెఱింగి యున్నను, నాహృదయముం గనుంగొనుట కీమిత్రుం డట్లాడెం గాని, యితరము గాదు. (మైత్రేయునిబుజమునం జేయివైచి) చెలికాండా! నీమూలమునంగద, సత్కాలక్షేపము జరిగినది. ఎంతయుసంతోషము.

మైత్రే:—(స్వ) ఆహా! ఇతం డెంతసాత్వికస్వభావుండు శాంతవర్తనమే, భూర్తకులవిభంజనము (ప్ర) జ్ఞానసంపన్నుండ వగుమార్కండేయా! నీమిత్రతకు నీనిష్కళంకహృదయమునకుం గడుంగడు సంతసించితి. నీవుదలంచినట్లు నిన్నుంగనుంగొనుట కే నట్లంటిం గాని, యితరము గాదు. మన్నింపుము.

మార్కం:—మిత్రుండా! మన్నించుటకు, నీయొనర్చినతప్పేమి? ఇంక

మన మందఱ మొకమా రాయీశ్వరు ధ్యానించి పిమ్మట కుశ, సమిధ, పుష్ప, పత్రాదుల గ్రహించి, గుర్వాశ్రమమున కేఁగుదము.

అందఱు:—అటుల నే గావింతము.

(అనుబంధము-14) (పుష్పములఁ గోయుట కై నిష్క్రమింతురు.)

"శ్రీరామచంద్రపరమాత్మనే నమః"

మార్కండేయ నాటకము.

తృతీయాంకము.

(మృకండాశ్రమము)

(మృకండమరుద్వతులుఁ గూర్చుని యుందురు)

మరు:—ప్రాణేశ్వరా! సుతుఁ డింకనురాఁ డయ్యెనే? నేఁ డనధ్యయనము గద?

మృకం:—వచ్చుచుండె నని యూహింతు.

మరు:—దేవా! కుమారు నింక మనయాశ్రమమున నే యుంచి విద్య నేర్పుదురా?

మృకం:—అటులే వర్తమాన మంపితిఁగద!

మార్కం:—
శార:— } (ప్రవేశించి) జననీజనకులారా! వందనములు
దేవా! నమస్కారము.

మృకం:—
మరు:— } నాయనా! రమ్మ (అని కుమారుని దగ్గఱకుఁదీసికొందురు)

మృకం:—(శారద్వతునితో) అబ్బాయీ! కూర్చుండుము. శాశ్వతబ్రహ్మనిష్ఠాగరిష్ఠుఁ డగు, మీయాచార్యుఁడు, శిష్యులు లోనగువారు, సుఖముగా నుండిరా?

శార:—అయ్యా! అందఱు కుశలముగ నుండిరి. మీతనయు దిగవిడచి,

క్షేమవార్తఁ గొనిరమ్మని సెలవిచ్చిరి. నా కాజ్ఞ నొసంగుఁడు.

మృకం:—సంతోషము. సర్వదా కృతజ్ఞుఁడ నని మనవిఁ జేయుము.

మరు:—నాయనా! యాశ్రమవాసినులకు విధేయురాలనని విన్నవింపుము.

శార:—చిత్తము. (నిష్క్రమించును)

మృకం:—(కుమారునితో) బిడ్డా! కులదీపకా!

చ. విదిత యశుండు కణ్వముని విద్య లొసంగెనె? గారవంబునన్
జదివి తివే? గురూత్తముని సన్నిధి భక్తి సమస్తవిద్య లిం
పొదవఁగ వాని నెల్ల విన నుంటిమి నేనును దల్లి కాన స
మ్మదమునఁ బల్కుచున్న మనముల్ వికసింపఁ గుమారరత్నమా.

మార్కం:—తల్లిదండ్రులారా సకలశాస్త్రములఁ జదివితి విద్యకు వినయమే భూషణమని గ్రహించితి. (అనుబంధము--15)

మరు:—తనయా! సహజాలంకార మగు,నీనమ్రత యే, నిన్ను విద్యావంతు నొనరించె. కన్నందుకు మాకును, విద్యోపదేశ మొనరించినందులకు గురులకును, సంతోషముఁ గూర్చితివి. ఐహికాముష్మికసుఖావలంబనమునకు, విద్యయే కారణభూతము గద.

మార్కం:—తల్లీ! పడరానిపాట్లన్నియుఁ బడి, నన్నుఁ గనుటచే నెక్కుడు ప్రేమ ముండుటయు, దానివలన నన్నుఁ జూచి కాని నాపల్కు లాలించి కాని మీ రానందించుట సహజమే. ఎంతటి యప్రయోజకుఁడైనను తమబిడ్డ తమకు మంచివాఁడుగనే తోచుట లోకసామాన్యము గద!

మృకం:—కుమారా! అట్లనకుము! శంకరవరప్రసాది వగుట నీ కేకొఱంతయు లేదు.

మార్కం:—జనకా! కొఱంతలే కేమి? సకలలోకశరణ్యుఁ డగు నీశ్వరు నారాధించితినా? అదిగొప్పలోపము గా కుండునా? మానవుఁడై జనించినందుకు, జననీజనకుల సంతోషపెట్టవలయు; వంశమర్యాదలఁ

గా పాడవలయు; సకలభూతసమదృష్టిని జరింప వలయు; విద్యాభివృ ద్ధికై పాటుపడ వలయు; జ్ఞానాభివృద్ధికై, పెద్దలపాదసేవఁ జేయవ లయు; ధర్మోద్ధరణమునకై, స్వశరీర, ప్రాణాపేక్షల నైతముద్యజి యింప వలయు; నిష్కాగరిష్ఠుఁడై సర్వేశ్వరుఁ బ్రసన్నుఁ జేసికొని, జ న్మరాహిత్యపదవి నందవలయు. అట్టివాఁడే మానవుఁడు; వానికే యంతటఁగొనియాడఁబడుయశస్సు చేకూరును. ఒకవేళ నిందేయం శమునఁ బ్రవేశింప కున్నను, మూఢభక్తిచే నైన భగవత్సేవ నొ నరింప వలయు (అనుబంధము--16)

కావున నేనీశ్వరసేవకై కాలనిరీక్షణ మొనరించు చుంటి. సెల వొ సంగినఁ బరమానందభరితుఁడ నగుదు.

మరు:—పట్టీ! మాకప్పుడే నీవియోగము ఘటింతువా?

మ. జననం బందితి మొన్నమొన్నె గదా? సంతోష మేపార వి
ద్యను నేర్పింపగఁ బంపఁగాఁ బడితి వంతఁ బంచమా బ్దంబునన్
దనయా! యీశ్వరుఁ గొల్వలేఁగనుచుఁ జింతన్ బొందె దేమంటుఁద
ల్లిని కన్నందుకుఁగొన్ని నాళ్లయినఁ బాలిన్ జూచికోఁ జెల్లదే?
తండ్రీ! నీ వన్నమాటనేనిఁ జెల్లించుకొన వలదా?

మార్కం:—అమ్మా! నే నే మంటిని?

మరు:—“తల్లిదండ్రుల సంతోషపెట్టవలయు” నని పలికితివి కద?

మార్కం:—సత్యమే! అయినను, శునకమువలెఁ జంచలవర్తనముగలచి త్తమునకు బుద్ధిఁ జెప్పి, యీశ్వరసేవా పరతంత్రుఁడై తదేకధ్యా నసంపన్నుఁడై, పరమానందమున మునింగి, తేలుచున్నతనయు నీ క్షించుట, మీసంతోషమునకుఁ గారణ మగుఁ గాని, నాలు గక్షర ములు పట్టువడుటయే కాఁజాలదు. కానఁనన్నుఁ జూచి ప్రస్తుతము సంతోషింపనగునా?

మృకం:—తనయా! నీవాంఛిత మత్యంతసమాదరణీయ మైనను, మా మురిపెముఁ జెల్లించుట కేని మఱికొంతకాల మోపిక నేయుము!

మార్కం:—జనకా! నేను దనయుఁడనై యుండఁ నీయాజ్ఞకు వ్యతిరేక ముండునా! (అనితల్లినిజూచి) అమ్మా! (ఆశ్చర్యముతో స్వగతము) ఇదేమి! నాతల్లి దుఃఖించుటకుఁ గారణ మేమి? (తల్లితో) మాతా! ఏల విచారపడియెదవు? మీయాజ్ఞలేక నేఁ బోఁగలనా? పోయిన, నాతపము సిద్ధించునా? మీరు మనఃపూర్తిగఁ బొమ్మనినపుడే పోయెదను చింతింపకుము (తనలో అనుబంధము-17.)

నావాక్యమే, యీమెవిచారమునకుఁ గారణము ఆహా నేనెంతదురాత్ముఁడను! తల్లికి సంతాపముఁ గలిగించి, పాప మొడిఁ గట్టితిఁ గద తల్లియన సామాన్యమా? ఆమెహృదయమునకు ఖేద మొదవించుటకంటెఁ ఘోర ముండునా? నిజము నాలోచించినచోఁ దల్లికన్నఁ జుట్టము, గురువు, దైవముం గలఁడా? మఱియు

చ. పరము నిహమ్ముఁ గూర్చు భవబంధములన్ దొలగంగఁ జేయుచు
స్తరమరితప్రచారములఁ సంహరణం బొనరించు మీఁద ధీ
వరు నొనరించు సంతసము పారముఁ గా నిడు మాతృభక్తిత
త్పరుఁ డగువాని కీశ్వరుఁడు, ధన్యుఁడు తల్లినిఁ గొల్చుపుత్రుఁడే.

కావున, సకలకల్మషములుఁ బటాపంచ లగుటకు, పతివ్రతాశిరోమణి యగునాతల్లిఁ బాదము లంటి నమస్కరించెద (తల్లికాళ్లపై బడి) అమ్మా! మన్నింపుము.

మతు:—నాయనా! ఈదుఃఖమునకు నాపురాకృతదోషమే కారణము, గాని, నీవు కావు.

మృకం:—(విచారము నటించును)

మార్కం:—తల్లీ! నీపురాకృతదోషఫలము, నేనె యగుదునా?

మృకం:—సుతా! నీయం దిసుమంతయు దోసము లేదు.

మార్కం:—(చూచి) అయ్యో! జననీజనకు లిర్వురు విచారగ్రస్తు లయిరే. దీని కేదియో మహాకారణ ముండును అడిగెదఁ గాక

(ప్రి) అమ్మా! నాయనా! మీసంతాపమున కేమికారణము? ఏల వచింపరు, నామనంబు తత్తరపడుచున్నయది. వేగ సెలవిండు.

మను:—నాయనా! ఏ మని వచింపఁ గలను! కుత్తుకబంటి యగు దుఃఖమున మాట రాక, తలదినంతనె, గుండెలవియు చున్నవి! నాయీ దురదృష్టజన్మమున కిఁ కెంతగడువు కలదో తోచదు. (అని దుఃఖించును.)

మార్కం:—అయ్యో! నే నెట్లుసహింతు? తండ్రీ! జ్ఞానమూర్తి వగునీవు టు విచారపడుచుంటివే? ఏటి కీమనస్తాపము?

మృకం:—నాయనా! సంతానములేమికై, పెక్కువత్సరములు చింతించి, గౌరీశంకరులఁ గూర్చి తపం బాచరించి, నినుఁ గంటిమి.

మార్కం:—సరియే! విచార మేల?

మృకం:—పరమేశ్వరుఁడు నిన్నుఁ బ్రసాదించుటకు మున్న వయఃపరిమాణ, గుణశీలాద్యాదుల నిర్ణయించుభారము మాపై నుంచ, నాయ భాగ్యవశమున సకృతాత్మునే దయసేయుఁ డని యర్థించితి.

మార్కం:—ఓహో! అట్లైన, నీకఁ బై సంగతిఁ దాము వచింపఁజాలరు సరికదా! నేను వినవలసిన యగత్యమును లేదు. "పాపీ చిరాయు స్సుకృతీ గతాయుః" అనునట్లు, నే నల్పాయుష్కుఁడ నైతిననియా మీసంతాపము? ఇందులకై, మీవంటివారు దుఃఖించుట చనునా? ఏకులంబునఁ జన్మించినను, ఎంత మహదైశ్వర్యసంపన్నులైనను, బుట్టినవాఁ రెన్నటికేని గిట్టుట సర్వసామాన్యముఁగద! కావునఁ, జింతించుట కవకాశ మేముందు నో సెలవిండు? సకలము దైవాధీనము! మనవలన నే మగు? (మఱియు,

ఉ. ఇంతకుముందు జన్మముల నెన్ని గ్రహించి నశించి యేరికిన్
గాంతుఁడ నైతినో! సుతుఁడు గాఁ జరియించితి నో!! వచింప ర
వ్వంతయు శక్య మౌనె? యెవఁ రైనను మృత్యువుగెల్వనేర్తు రే?
చింతిల నేల? మీ కొమరు జీవితకాలముకై భవాదృశుల్.)

మరు:—హా! తనయా! సుగుణనిలయా! నీ వెంతఁగఁ బల్కినను దుఃఖ దవానలమున కే నెట్లు తాళుదు? ఏకపుత్రవిషయమున నూరట జనించు టెట్లు!

మార్కం:—అమ్మా! ఇంత కెక్కుడుఁగ విలపించి యైన నా కాయు ర్దాయముఁ దేఁగలవా?

మృకం:—తండ్రీ! కర్మగతి యిట్లుండ, నంతటిభాగ్య మెట్లు గలుగును.

మార్కం:—కట్టా! దైవమా! గౌరీమనోహరా! దీనబంధు!

(సీ. ఆయు వల్పం బౌట హా యెట్లు సైతురా?
తనయుఁడా యని తల్లి తల్లడిల్ల
మగవాఁ డగుటచేత మనమున నే స్రుక్కి,
జనకుఁ డీరీతి బాష్పములు విడువ
నిదుఃఖవారాశి నీదుచుం డెడివీరిఁ
గనుచున్న నచటి మృగంబులేడ్వ
దిక్కులే కార్తిచేఁ బొక్కుచుండెడివీరి
నూరడింపఁగఁ దగు వారు లేక

గీ. అక్కటా! నేటి కీమృకండాశ్రమంబు
సంతసముఁ దక్కి ఘోరదు రంత దుఃఖ
భాజనం బయి, గతిఁ జూపువారు లేక,
నీరసం బయిపోయెనే నిర్మలాత్మ!)

ఆహా! పుత్రమరణదుఃఖముకన్న "గొడ్డువా" రనుచింత యే యుక్త మమైనది. ఇంతటిసంతాపమున మునింగెనతల్లిదండ్రులఁ గాంచి, ఇ తికర్తవ్యతామూఢుఁడ నైయుండవలసె. (కటకటా అగాధమై దుస్సహమై, దుర్భరమై, సతతహృదయశల్యప్రాయమైన, కు మారమరణశోకము నివారింప మార్గమెయ్యదియు లేదు. వృద్ధులై చిరకాలమున కొక్కబిడ్డనిం గని, తుద కాతని నచిరకాలముననే కోలుపోవుటచే ముకుళీభూతము లైన, జననీజనకహృదయాంబుజము

లు. వెండియు వికసించుట దుర్లభము) ఛీ! ఛీ! నే నేలజన్మించితిని,
(భగవంతు నుద్దేశించి) ఓరజతగిరినివేశా! యీశా!

కం. ఎందుకు నను బుట్టించితివి?
వెందుల కల్పాయు వొసఁగి ♦ యీగతి వీరిక్
గుందించు చుంటివి? ప్పూరట
నొందరు నే నేమిసేతు ♦ నో జగదీశా!

ఆహా! దుర్భరము! దుర్భరము! (అని వినుట నటించి) ఆహా: విపం
చీనినాదము కర్ణపేయ మై యలర నారదమహాముని దయచేయు
చున్న ట్లున్నదే (తల్లిదండ్రులతో) జననీజనకులారా! హరినామా
మృతపానజీవనుం డగు దేవర్షి వచ్చు చున్నవాఁ డూరడిల్లుఁడు.

మృకం } (కన్నుల నీరు దుడిచికొని సంతోషమును సూచించు
మరు } చుందురు)

మృకం:—మరుద్వతీ! మహోపకారి యగు నితఁ డిప్పట్టున నేదో యొ
కమార్గము నుపదేశించునని యూహించెద!

మరు:—అయినఁ గృతార్థుల మే కద! దేవా!

(ప్రవేశము నారద, విశ్వామిత్రవసిష్ఠులు)

ఋషు:— జయ: సకలలోకగురో!

మృకం } (లేచి నిలచుందురు)
మరు }

మృకం:—ఓహో! ఏమినా భాగ్యము! త్రిమూర్తులో యనుచందమున
విశ్వామిత్ర,వసిష్ఠ, నారదులు దయచేసిరే? ధన్యోస్మి! ధన్యోస్మి!

మార్కం:—పరమతపోధనులారా!

గీ. స్వార్థవిషయేచ్ఛ లుడిఁగి, ని ♦ శ్చలతపః ప్ర
భావు లై లోకహితముఁ గూ ♦ ర్పం దలంచి,
యనిశ మీశ్వరుఁ గొల్చుమ ♦ హాత్ములార!
త్వత్పదాంబుజముల కిదే ♦ వందనంబు:

విశ్వా } దీర్ఘాయురస్తు
వసి }

నార:—(నవ్వును)

విశా:—ఏమి? నారదా! మే మీకుమారుఁ దీవించినంతనె నవ్వ సాగితివి

నార:—ఏమియులేదు. సృష్టికిఁ బ్రతిసృష్టిఁ జేయఁగలసమర్థుఁడవు నీవును, సకలజగద్గురుం డని విఖ్యాతి వడసినవసిష్ఠుఁడును పొరపాటునకు బాల్పడితిరే యని, నవ్వు వచ్చినది.

వసి:—అ దెట్టిది?

నార:—శంకరుఁ డీకుమారుఁ బ్రసాదించినపుడు "పదియాఱువత్సరము లాయుఃప్రమాణ" మని యానతిచ్చె నట. మీ రాయాజ్ఞకు వ్యతిరేకముగ, 'చిరాయుర' స్తని దీవించుట పరిహాసాస్పదము గాకుండునా? భగవంతునివాక్యమున కడ్డుండునా? మునులు తెలివిలేనివారని లోకము లూరకె గేలి యొనర్చునా? ఈలాటి యవ్యక్తములే కారణము.

విశ్వా:—ఔరా! నారదా! అవ్యక్తమా? తెలివిమాలినతనమా? పరిహాసాస్పదమా? అపరబ్రహ్మ నైననేను దీవించుటయు, నయ్యది వృథ యగుటయునా? అట్లే యైన నవగ్రహపథంబులకు మార్పుకలిగి, తార లల్లాడి, కులపర్వతంబు లొక్కుమ్మడిం గూలి, శేషునిఫణము లదరి, జలనిధులు మేరమీఱి, ప్రచండమార్తాండుఁడు దనసహస్రకిరణములఁ బ్రసరింపఁ జేయుమట్టమధ్యాహ్నమున నిర్దుష్టముగ నక్షత్రము లెల్లరకుఁ గోచర మై భువనము లల్లకల్లోల మై నూతనసృష్టి సంపద లేర్పడ కుండునా?

నార:—(స్వ) ఈతని కింకఁ గొంచెము పురివెట్టెద(ప్ర) విశ్వామిత్ర! నీవు సమర్థుఁడ వే యైనను, బ్రహ్మవ్రాత కడ్డుండునా? ఆశీర్వచనము లన్నియునెఱవేఱునా? ఈశ్వరుఁడు యోజనలేనివాఁడా? కావునఁ దొందరపడకుము.

విశ్వా:—ఔరా! నారదా! నీకలహభోజనచమత్కారవాక్సంధానము నాకడఁ జూపకుము నాదీవన లితరదీవనలవంటివి కావు. శంకరుఁడు యోజించువాఁడె యైన భస్మాసురాదులచే భంగ మొందునా? సంతానములేనివారి నక్కటె యుంచక, యీకుమారు నేల నొసంగవ లయు? పోనిమ్ము. అల్పాయుర్దాయ మేలఘటింపవలయు? ఎవ్వఁడే ని క్షుద్బాధచే మలమలమాడుచు, యాశ్రమమున కరుదెంచి "భిక్షాందేహి" యని నిన్నర్థించిన విషఫలాహార మొసంగఁ గలవా? అదిధర్మమా?

నార:—ఇది యంతయుఁ గర్మసూత్రము.

విశ్వా:—కర్మసూత్రమో, అధర్మసూత్రమో, చూచెదవుఁ గాక.

వసి:—మీవాగ్వాదములఁ జాలించి, ఋషు లమోఘవచస్కు లనుట సార్థకపరచుఁడు.

విశ్వా:—ఏల వ్యర్థ మగును? మృకండా! వినుము.

ఉ. వారినిధుల్ గలంగినను, వహ్నికి శీతలభావ మబ్బినన్
మేరువ బీటవారినను మేదినికంపము నొంది కృంగినన్
గూరిమి నీకుమారునకుఁ గూర్తుఁ జిరాయువుఁ బట్టువట్టి న
న్నారయ వే! త్రిమూర్తులకు నైన భయంపడ నంచు నెన్నుఁడున్.

కావున నీకుమారుని నావెంట బ్రహ్మలోకమున కంపుము. అయ్యెడ సఫలము గాకున్నఁ గైలాసమున కరిగి భూతనాథు నడిగి, యేవిధమున నైన సాధించెద. నీ వించుకయు సంశయింపకుము.

వసి:—మృకండా! నేను నైతము వెంటనుందుఁ గానఁ దనూజునంపుము.

మరు:—(మృకండునితో) ప్రాణేశ్వరా!

క. పిలువని పేరంటముగా
నలఘుతపోమహితు లిచటి కరుదెంచి యిటుల్
బలుకుదురె? దీనికిన్
ఫల ముండు నటంచు నెంతు భావమునందున్.

మృకం:—కాంతా! నాకును నష్టే పొడకట్టుచున్నది (మునులతో) తాపసోత్తములారా! పెన్నిధి నిరసించు పేదవాఁ డుండునా! కుమారుఁ గొంపోయి, యచిరకాలమ్ముననే, తిరిగి మాకనులకప్పుఁ దీర్పుఁడు (మార్కండేయునితో) నాయనా!

చ. విమలతపోనిధానులగు ♦ వీరలతో జనుమయ్య సత్యలో
కమునకు సృష్టికర్త యగు ♦ కంజజుదర్శనముం బొనర్చి పా
దములకు మ్రొక్కి కనిగని యు ♦ తం డిడుదీవనలందు మయ్య ప్రా
ణములను నీపయిన్ నిలపి ♦ నారము వేగము రమ్ము పుత్రకా!

మార్కం:—చిత్తముజనకా! జననీ! నమస్కారము (తల్లికినమస్కరించును)

మరు:—నాయనా! వినయధురీణా!

గీ. తండ్రి పరమోత్తముఁడు నగు ♦ తపసినేని
నేను జగదంబఁ గొల్చెడి ♦ దాన నేని
ఋషులపల్కులె వేద మై ♦ యెసఁగు నేని
నీకు శుభములు చేకూరు ♦ గాకసుతుండ!

తనూజా! పోయిరమ్ము.

వసి:—పుత్రప్రేమచే దివు లొందక, సర్వేశ్వరు నారాధింపుచుండుఁడు. కుమారునకిసుమంతయు భయము లేదు.

విశ్వా:—మార్కండేయా రమ్ము. (వెళ్లుట నటింతురు తెరపడును)

“ శ్రీరామచంద్రపరమాత్మనేనమః ”

మార్కండేయనాటకము.

చతుర్థాంకము

సత్యలోకమార్గము.

(ప్రవేశము ముందు నారదుఁడు వెనుక మార్కండేయ విశ్వామిత్ర వసిష్ఠులు.)

నార:—(తనలో) శ్రేష్ఠ మగుకలహబీజము దొరకినది. ఇది యమ హృదయ మనుక్షేత్రమున నాటి ఫల మనుభవింపవలయు. కానిమ్ము సత్యలోకవిశేషముఁ గూడనరసెద.

మార్కం:—(అనుబంధము—18)

తెరయెత్తగా సత్యలోకము:—బ్రహ్మ, సరస్వతీ కూర్చుని యుండుట కాన్పించును)

ఋషులు:—భారతీనాథా! నమోస్తు నమోస్తు.

బ్రహ్మ:—ఓహో! పరమతపోధను లగు విశ్వామిత్రవసిష్ఠనారదులా! కూరుచుండుఁడు.

ఋషు:—(కూర్చుందురు)

వసి:—మార్కండేయా! సృష్టికర్తకు నమస్కరింపుము (అని జనాంతికముగాఁ బలుకును).

మార్కం:—(చేతులు జోడించి)

సీ. సత్యలోకేశ్వర ♦ జగదేకవంద్య!
నీపాదాంబుజములకు ♦ వందనంబు
కనకాంబరునినాభి ♦ కమలమం దుదయించి
వరలుపరబ్రహ్మ ♦ వందనంబు
పదునాల్గుభువనముల్ ♦ వరుససృష్టించిన
పరమపావనమూర్తి ♦ వందనంబు
అఖిలవిద్యాప్రదా ♦ యనిలోకమాత యౌ
వాణీమనోనాథ! ♦ వందనంబు
గీ భక్తరక్షణ! నీకిదే ♦ వందనంబు
పతితపావన చారిత్ర ♦ వందనంబు
పద్మగర్భ' దయానిధే ♦ వందనంబు
భవవిదూర! చతుర్ముఖ ♦ వందనంబు.

బ్రహ్మ:—కల్యాణం భూయాత్ కల్యాణం భూయాత్.

ఋషు:—(మోములు వాల్తురు)

నార:—ఈవిషయ మిచ్చట తేలలేదు. విశ్వామిత్రుఁ డింతతో నూర కుండఁడు నాకుఁ గడుపునిండ నోగిరము లభియించుట కే యభ్యం తరమును లేదు.

బ్రహ్మ:—ఋషిసత్తములారా! మీ రేదియో నాలోచింపుచు ముఖ కాంతులఁ దొలఁగి న ట్లుంటిరి కారణమేమి?

విశ్వా:—సృష్టి యింతగా నున్న దని,

బ్రహ్మ:—సృష్టి కేమిలోపము? మీ రరుదెంచినకార్య మేమి?

వసి:—మహానుభావా! చిత్తగింపుము. (మార్కండేయునిఁ జూపి) ఈకు మారుఁడు శంకరవరప్రసాదమున మృకండమరుద్వతులకు జన్మించిన వాఁడు. నీలకంఠుఁ డీతని నొసంగునాఁడు పదియాఱువర్షము లాయు వని వచించె నట; మేము మృకండాశ్రమమున కరిగినప్పు డీతని న మస్కారమునకుఁ జిరాయు రస్తని దీవించి పిదప నమ్మహేశ్వరు

వాక్ప్రసక్తి దెలిసి విచారించి యితని మా వెంటఁ బెట్టుకొనివచ్చి నీపాదములకు నమస్కరింపఁ జేసి నీయాశీర్వచనప్రభావమున మా పలుకులనైతము సార్థకపఱచుకొన నెంచి కొండంత యాసతోఁ జనుదెంచితిమి:

బ్రహ్మ:—అయ్యో! ఎంతవిచారము! నావ్రాలుఁ దుడువ నాకే సాధ్యముకా దని మీ రెఱింగినవిషయ మే యయ్యు నిట్లు కోరుట భావ్యమా! నే నిం కేమ నందు?

విశ్వా:—అనుట కే మున్నది? చేయుట కే మున్నది? ఈమార్కండేయుఁడు దీర్ఘాయుష్కుఁడు గాక మాయాశీర్వాదము వ్యర్థ మగు నేని,

ఉ. శీతనగోన్నతస్థలి వ ♦ సించి మహత్తర మైన నిష్ఠ ఘో
రాతపవర్ష బాధలకు ♦ నైన జలింపక రుద్రపాదముల్
ప్రీతిభజించి బ్రహ్మపద ♦ విశ్ గయిసేసిన నాతపంబునం
దీతనికోసమై సగ ము ♦ హీనముగాఁ ద్యజియింతు ధాత్రిపైక్.

నార:—(స్వ) బలే! బలే! విశ్వామిత్రహృదయకమలము చక్కగా రవులు చున్నది. నా కింకఁ గొద వేమి? (బ్రహ్మతో) తండ్రీ! వినుచున్నావుకద.

బ్రహ్మ:—విశ్వామిత్ర! కారణములేక కినియుట పాడియా! సమస్తజీవరాసులఁ బుట్టింప నేనును బోషించుటకు శ్రీ మహావిష్ణువును సమయించుటకు రుద్రుఁడును నౌ నని తెలియునుగద కావున నాతనిపాలికిఁ బోయివిన్నవింపుఁడు. నన్ను నెపపెట్టుటవలనం బ్రయోజన మేమి?

వసి:—చిత్తము (తెరపడును)

కైలాసమార్గము

(ప్రవేశము విశ్వామిత్రవసిష్ఠనారదమార్కండేయులు)

మార్కం:— (అనుబంధము--19)

నార:—గాధినందనా! దారుణప్రతిజ్ఞఁ గావించితివి కాని పుట్టించినవాఁడే తనవలనఁ గాదన గిట్టించువాఁడా దయ గనుట!

విశ్వా:—ఏమి? నారదా! బ్రహ్మమానసపుత్రుండ వైనందున పక్షపాత మగపఱచు చుంటివే! చాలింపుము చాలింపుము.

నార:—సరిలే నడువుము. (అందఱు నడచు చుందురు)

మార్కం:— (అనుబంధము--20) నిష్క్రమింతురు)

(తెర యెత్తగా కైలాసగిరిపై గౌరీశంకరు లగపడుదురు)

గౌరి:—చిరకాలమునుండి నా శోకసందియము బాధాకర మై యున్నది; దేవర క్షమింతు రేని విన్నవించుకొనియెద.

శంక:— హైమవతీ: ఏ మాసంశయము?

గౌరి:—పరమేశ్వరుని యాజ్ఞ లవిచ్ఛిన్నము లని వేదశాస్త్రము లుద్ఘోషింపుచుండెఁ గద! ఆయాజ్ఞ లవి యెవ్వి? ఎప్పు డొసంగఁబడును?

శంక:—ప్రతిజంతువుజన్మించు నపుడు తొలిజన్మములం బట్టి ఫలములు లిఖింపఁబడును. అవియే యీశ్వరాజ్ఞ లని యందురు.

గౌరి:—అటులైన జన్మాంతరసుకృత-దుష్కృతములం బట్టి సుఖదుఃఖములు గలుగుచుండ సర్వమును గర్మ యని తలంపవలయు నే కాని తమ కాపద సంభవించి నపుడీశ్వరా! రక్షింపు మనియాక్రందన మొనరించిన నేమిప్రయోజనము?

శంక:—కొంత పరిశాంతికొఱకును నుత్తరజన్మములో సుఖించుటకును మొరసేయుదురు

గౌరి:—ఈతత్వ మెఱింగినవిజ్ఞులు పరమేశ్వరునికంటెఁ గర్మ గొప్ప దందు రేమో?

శంక:—అది సహజమే. హరిహర బ్రహ్మేంద్రాదు లైననుఁ గర్మమునకు బద్ధులై యుండవలసినదే

గౌరి:—తమరు మృకండమరుద్వతులకుఁ బ్రసాదించినకుఱ్ఱవానివయఃపరిమాణ మల్ప మగుటకుఁ దల్లిదండ్రులకర్మ కారణమా? తనయుని

కర్మ కారణమా? లేక యాపదియాఱవ వత్సరము లనుదాని కేమర మగు నర్థ మేమైనఁ గలదా?

శంక:—(చిఱునవ్వుతో) ఇంతకాలమునుండియుసీ ప్రశ్నలువేయు టిం మలకా!

గౌరి:—శ్రమకుఁ గోపింపక నాయీసందియమును బాపవేడెద.

శంక:—సుదర్ధాంగి వయ్యు నీవిషయ మూహింపలే కుంటివా?

గౌరి:—నే నొకవిధమున నూహించితిఁ గాని అగునా కాదా యని సం శయించు చుంటిని.

శంక:—ఏ మని తలంచితివి?

గౌరి:—వినుటకుఁ బదియాఱైనను గణితవరుసకు నూటా ఱగునట్లును తపోమహిమంబున యోగమార్గమునఁ జిరకాలజీవిత మొసంగుటకు ను, భూతదయాపరు లగు తాము నిశ్చయించుకొని, నిమిత్తమాత్ర ముగ నట్లంటి రని భావించితిని. తప్పయిన క్షమింపుఁడు.

శంక:—గౌరీ! నీయూహ మిక్కిలి సమంజసము. అయినను నీవిషయ మిప్పుడే వెల్లడింపఁ జనదు.

గౌరి:—చిత్తము.

(ప్రవేశము భృంగిరిటుఁడు)

భృం:—జయము. జయము. గౌరీమనోహరా!

శంక:—భృంగీ! విశేష మేమి?

భృం:—దేవా! విశ్వామిత్ర వసిష్ఠ నారదులును వెనుక నొక బాలకుఁ డును వచ్చు చుండిరి.

శంక:—వారికి శుభప్రవేశ మొనరింపుము.

భృం:—చిత్తము. (నిష్క్రమించును)

శంక:—పార్వతీ! ఋషిత్రయము వెనుక నున్న బాలుఁ డెవ్వఁడో?

గౌరి:—ఒకవేళ, మార్కండేయుఁ డే యగు నేమో!

(ప్రవేశము మునులు మార్కండేయుఁడు) (అనుబంధము-21)

విశ్వా:-సీ. రజత శైలని వేశ! ♦ భుజగభూషణ బంధ,
భవపాశనాశ! తు ♦ భ్యం నమోస్తు
వసి:- గిరిజామనోనాథ ♦ గరళశోభితకంఠ,
పరివిమలదేహ! తు ♦ భ్యం నమోస్తు
నార:- గంగాతరంగోత్త ♦ మాంగ! సత్కరుణార
సాంభోధి దేవ! తు ♦ భ్యం నమోస్తు
మార్కం:- భక్తావనోల్లాస! ♦ పరితతభిక్షుక వేష,
ఫాలాగ్ని నేత్రి! తు ♦ భ్యం నమోస్తు.
గీ సకలభువనైకవంద్య! ప్రి ♦ శస్తహృదయ!
యోగిజనహృద్వనవిహార! ♦ రాగరహిత!
నందివాహ! మహేశ! బా ♦ లేందుమౌళి!
యగణితోత్తమచరిత తు ♦ భ్యం నమోస్తు.
(శిరము వంచి నమస్కరించును)

శంక:—మనోవాంఛితార్థసిద్ధి రస్తు.

ఋషు:—ధన్యోస్మి! ధన్యోస్మి! పరమేశ్వరాశీర్వచన మమోఘమై వెలయుం గాక.

(అని చేతులెత్తి నమస్కరింపుచుండ- తెరపడును.)

(అరణ్యమార్గమార్గము. ప్రవేశము ఋషులు మార్కండేయుండు.)

మార్కం:—(అనుబంధము-22)

నార:—నిటలాక్షుండు "మనోవాంఛితార్థసిద్ధి ర" స్తని. దీవించెగాని నా కించుక సందియ మగుచున్న దేమందువు? కౌశికా!

విశ్వా:—ఎందువలన?

నార:—ఈకుమారుండు గాని ఈతనినిమిత్తమై మనముగాని వాంఛించి నదిదీర్ఘాయు వగుట నీశ్వరాశీర్వచనమున నది సమకూడునుగాని "పదియాఱువత్సరము" లనిమున్నువచించుటకుం గారణ మేమి? దాని కిప్పుడేరీతి మార్పు కలుగును? పరమేశ్వరుం డది మరచెనా? మ

నమనోగత మెఱుంగఁడా? యేయితరకారణమైనఁ గలదా! యిది యే నాసంశయము.

విశ్వా—ఈశ్వరునకు మరపు జనించుట కల్ల. ఆశీర్వచనము నెఱవేఱుకుండు టంతకంటె నసత్యము గద? కాని తొలుత నట్లాన తిచ్చుటకుఁ దగినగోప్య మగుభావ మేదియో యుండ నగుఁగాన సంశయవిముక్తుల మై బాలునిఁ గొంపోయి జననీజనకులఁ జేర్పుదము.

వసి:—ఇయ్యది నిశ్చయము. అయినను పరమేశ్వరాశీర్వచనము నెఱుంగక గడువు సమీపించు నప్పటి కితనిఁ గొంపోవ యమదూతలు గాని యముఁడుగాని రావచ్చును. అందుచే నీబిఱుతఁ డిప్పటినుండియు నప్రమత్తుఁ డై తపస్సమాధిం బ్రవేశించె నేని మృత్యువునకుఁ జిక్కవలసిన యగత్యముండదు సగకదా; తనదాసుని బాధించు కాలుని వారించుటకై భక్తపరతంత్రుఁ డగుశంకరుఁడు సాక్షాత్కరించి సంవర్తిని వారించి యీతని రక్షించుట యే గాక తనగాంభీర్యాభిప్రాయమును లోకమునఁ వెల్లడింపఁగలఁడు. కావున శంకించుట కవకాశ మెంతమాత్రమును గలుగదు.

నార:—ఇ దంతయు నాకుఁ గోచరమే యయ్యె మీయభిప్రాయములఁ గనుఁగొనుట కట్లంటిని. ఇఁకఁ బోవుదము రండు. పాపము; కుమారునికొఱకు వారు నిరీక్షించు చుందురు.

మార్కం:— (అనుబంధము-22)

(అందఱు నిష్క్రమింతురు)

"శ్రీరామచంద్రపరమాత్మనే నమః"

మార్కండేయ నాటకము.

పంచమాంకము.

(పర్ణశాలముంగిట మరుద్వతి కూర్చుని యుండును)

మరు:— (అనుబంధము--23)

కష్టా! బ్రహ్మలోకవిశేషములేమో తెలియవు. సుతుఁ డింకను రాకున్న వాఁడు! ఈశ్వరనిర్ణీత మగునిర్యాణకాల మిఁక నొక్కవత్సరములోఁ బూర్తి కానున్నది. నా ప్రాణములు సుడివడుచున్నవి. దుఃఖపరంపరలు పొరలి పొరలి వచ్చుచున్నవి. హా! తనయా! నాయట్టిదురదృష్టరాలిగర్భమున జనింపకున్న దీర్ఘాయుష్కుఁడ వయ్యెడివాఁడ వేమో కద? తండ్రీ! నీచేతులమీఁదుగ దాటిపోయెడిభాగ్యమున కేనోచితినో లేనో కద! అయ్యో! కుమారా! (అని దుఃఖించుచుండ)

మృకం:—(ప్రవేశించి) (స్వ) ఆహా! ప్రణయమహిమ . మనిర్వాచ్యము-(ప) మరుద్వతీ! విలపించినఁ బ్రయోజన మేమి? ఈశ్వరాజ్ఞకు వేచి యుందము. కుమారునిముఖంబున భవితవ్యము నెఱుంగవలదా? ఊరడిల్లుము.

మరు:—ప్రాణేశ్వరా! ఇంకఁగుమారునోట వినవలసిన దేమి యుండును! అట్టి యదృష్టమే యున్న నింతపుట్టునా? కుమారనామస్మరణమాత్రమున గుండె లవియునా?

మృకం:—కాంతా! ఎంత వెఱ్ఱిదానవు?

గీ. ఎలమి సస్యాఢ్యముగ ఫలి ♦ యింప జేయు
వర్షఋతువున కాదిని ♦ భయదమేఘ
గర్జితార్భాటములు గల్గు ♦ కరణిఁ గాగ
సుఖములకుఁ గష్టములె వచ్చు ♦ చుండు మొదల.

అట్టికష్టసమయమునం దోరిమియే ప్రకాశింపవలయు.

ఇదియునుంగాక విశ్వామిత్రుఁడుప్రతినఁ బూనుటచేఁగొంచమాలో చింప వలయు. అతడు నిరుపమానతపోబలసంపన్నుఁడు సృష్టికిఁ బ్రతిసృష్టిఁ జేయఁగల సమర్థుఁడు. ఆతనివెంట నున్న వారునారదవసిష్ఠులు అప్రతిమాన సహజవైరానలజ్వాలాకర్షితచిత్తులగు విశ్వామిత్రవసిష్ఠులును, కేవలకలహభోజనుఁడై భువనములఁడీకొల్పి తాఱుమాఱుఁ జేయఁగలతంపులమారినారదుఁడును, తమతమవర్తనలమాని యన్యోన్యసహాయులై మనకుమారునివిషయమై పట్టుదల వహించుటచే సరియగుఫల ముండును, కుమారుని వారలతోఁ బంపునపు డీయది నీవే నుడివితివి గద?

శిష్యు:—(ప్రవేశించి) ఆచార్యా! కుమారసహితముగఁ దాపసు లేతెంచుచున్నవారు.

మృకం:—మహాభాగ్యము.

మరు:—(ఆతురతతో)నాయనా! ఎంతదూరముననుండిరి?

శిష్యు:—అమ్మా! ఇదిగో సమీపమున కేవచ్చిరి.

మృకం—
మరు:— } (లేఁచి యెదురుగా బోవుచుండుట నటింతురు)

మరు:—(స్వ) కట్టా! ఏమని విందునో కద.

ఋషు:—(కుమారునితోఁ బ్రవేశింతురు)

మృకం:—మునితల్లజులకు స్వాగతము.

మార్కం:—జననీజనకులారా! నమస్కారము.

మృకం:—
మరు:— } తండ్రీ! రమ్ము.

విశ్వా:—(మృకండునితో) విభాండకుమారా! సర్వము శుభ మయ్యె. ఆనుపూర్వికగా మీానందమునివలనఁ దెలియుదురు గాక. మేము పోయివత్తుము. మార్కండేయా! సుఖంబుండుము.

మృకం:—
మరు:—
మార్కం:— } మహాత్మా! నమోస్తు.

ఋషు:—విజయీా భవ! విజయీా భవ.

నార:—(స్వ) ఇఁకనాపనిమీాఁద, నే నుండవలయు.

(విశ్వామిత్ర వసిష్ఠ నారదులు. నిష్క్రమింతురు)

మరు:—(కుమారుని తలవెండ్రుకల సవరించుచుండ)

మృకం:—బిడ్డా! గిరిగహ్వర ఘోరారణ్యమార్గగమనమునఁ జిగురుటాకులం బోలునీపాదము లెంతనొచ్చెనో!

మార్కం:—జనకా! ప్రేమచే నడిగితిరి కాని సర్వేశ్వరుఁడు సర్వకాలములయందు, సర్వవిధముల దయఁగలిగి సర్వాంతర్యామియై, సహస్రనేత్రములచేఁ గనిపెట్టుచు, సంచరించుచుండ నాతనిచరణదాసులకు శ్రమ యుండునా?

మృకం:—కుమారా! నిజము.

మరు:—నాయనా! సత్యలోకవిశేషము లేమొా వినిపించెదవా?

మార్కం:—జననీజనకులారా! సత్యలోకమునుండి కైలాసమున కేఁగవలసివచ్చుటచేఁ జని శంకరు దర్శించి నమస్కరింప, నమ్మహేశ్వరుఁడు “మనోవాంఛితార్థసిద్ధిర” స్తని దీవింప మనోవాంఛ దీర్ఘాయువే యగుట సంతసించి, సెలవుఁగైకొని వచ్చుచుండ, వసిష్ఠులవారిట్లని యాన తిచ్చిరి.

మరు:—ఏమని తండ్రీ!

మార్కం:—ఈశ్వరుఁడు విస్పష్టముగ దీవింపక గంభీరముగఁ బల్కెఁ గాన, నది స్పష్టీకరించుట కీకుమారుఁ డిప్పటినుండియుఁ దపస్సమాధిం బ్రవేశింపవలయు నని వక్కాణించిరి.

మరు:—నాయనా! మే మింకను నిశ్శంకహృదయులమై జీవించువున్నెము గలుగ దయ్యానే! మ మ్మీవిధమున డించి, నీవొక్కండవే తపంబున కేగెదవా? మే మెట్లు బ్రతుకుదుము. మమ్ముఁగూడఁ దీసికొనిపొమ్ము. భగవంతునిదయయెట్లు పరిణమించినను, ని న్నను సగించియేయుందుము.

మార్కం:—తల్లీ! తపంబునకై యొంటరిగను, విద్యకై సహవాసము తోడను జనవలయునని, పెద్దలు వచింతురు గద! అట్టిచో నిట్లు కోరదగునా?

మరు:—పుత్రికా! యె ట్లిడఁబాసి యుండఁగలము?

గీ. రంగదుత్తుంగభంగత ♦ రంగజంతు
సంకులం బయి ఘోషించు ♦ సంద్రమునకు
సరగ నెన్నటి కేనిఁ బ్ర ♦ శాంతికలుగుఁ
గాని, మాదుఃఖమున కంతు ♦ కలుగదయ్యో.

మృ:—(భగవంతు నుద్దేశించి) ఆహా! పరమేశ్వరా! నీనిర్ణయము లెఱుంగ నసాధ్యము.

మార్కం:—అమ్మా! విధినియోగము దాట నలవి యగునా? పరమేశ్వరుఁడునై తము, కర్మబద్ధుఁడై, యనేకగతుల సంచరించు చుండలేదా?

ఉ. తిండికి లేదొ? కట్టుకొనఁ ♦ దెల్లనివస్త్రమె లేదొ? భాగ్యమే
యుండదొ? ఏమిలోటు తన ♦ కుండెఁ? జతుర్దశలోక నాథుఁడై
యుండెడిశంకరుండును, మ ♦ హోగ్రభయంకర కర్మచేతఁగా
కుండినఁ బేదవాని యటు ♦ లుండఁగఁ గారణ మేమి? తెల్పుఁడీ!

సర్వప్రపంచము కర్మ యనురజ్జువుచే బంధింపఁబడి యుండుట మీ రెఱుంగరా?

మృకం:—తండ్రీ! పసివాఁడ నయ్యుఁ బరిపూర్ణజ్ఞానముఁ గలనీతో నే మని మాట లాడుదును?

మను:—నాయనా! మా కిం కేది గతి? యెవరు దిక్కు? ఎంతటిదుష్కాల మాసన్న మయ్యెను? అయ్యో! నాతండ్రీ! ఎట్లు పొమ్మని చెప్పఁగలను? నే నేల బ్రతికి యుంటిని? (విలపించును)

మార్కం:—అయ్యయ్యో! దుఃఖమున కిప్పు డేమి యవకాశము? మఱికొంతకాలమునకైన నాశరీరము నాశ మొందక శిలవలె నిలచి యుండునా? శిల యైనను గొన్నినాళ్లకు ఖిలమై పోఁగలదు. బుద్బుదప్రాయ మగుదానికొఱకు విలపించు టెందులకు? నిజముగ నాలోచించినచో

సీ. కఫవాతపైత్యరో ♦ గములచేఁ గృశియించి,
మారణంబై పోవు ♦ మట్టిబొమ్మ
దుర్మోహవాంఛితా ♦ దులఁ జిక్కి చెడిపోయి
హేయమై నశియించు ♦ మాయబొమ్మ
రక్తమాంసాదిమ ♦ ద్గంధభూయిష్ఠమై,
రాలి పోయెడు నట్టి ♦ తోలుబొమ్మ
మలమూత్రజంతుసం ♦ కులమై మహాగ్నిఁ జే
కొని కాల్పఁబడునట్టి ♦ కొయ్యబొమ్మ

గీ. పుడమిపై నాల్గుదినములు ♦ బొమ్మలాట
తనువుశాశ్వతమనుచును ♦ దలఁపకమ్మ
అమ్మ! "జాతస్యమరణంధ్రు" ♦ వమ్మటంచుఁ
బలుకు టే సత్యమగు నని ♦ తలఁపు మమ్మ!

ఈషణత్రయముల వర్జించి, కామాదిశత్రులకు లోఁబడక సర్వము

సర్వేశ్వరుఁడే యనునిశ్చలచిత్తమున నాతనిచరణముల భజించువారలకే మోక్షము కరతలామలక మనుధర్మసూత్రములఁ బాగుగా నెఱింగి గేస్తురాండ్రలోనగ్రగణ్యత వహించిన పరమపావనివి నీవును అనిమిషులచేనైతము బొంగడ్డఁ గాంచినమునిజనమూర్ధన్యుఁడగు తండ్రియు నస్థిరమైననాతనువుకొఱకు విచారపడుచుంటిరేకాని ముందుత్రోవఁ జూచుకొనరైతిరి. ఒకవేళ నే జీవించియుండగనె మీకు కాల మాసన్నమగు నెడల నీకుమారనామకశాఖపై దట్టముగ నల్లుకొనఁబడినమోహాలతఁ దెగఁగోసి పోవుదురా? లేక, మృత్యువుతో బోరాడి జయించి నన్నెడఁబాయక యుండఁగలరా? అదియెంతకష్టము? ఏజీవముఁగాని జన్మజరామృత్యుభయంబులకు వెలియై సుఖముగా మనియుండఁజాల దనుట మీ రెఱింగినదే కద? ఇదియునుంగాక నేను మీదుఃఖముఁ గాంచి భరింపఁజాలక బ్రతికినంతకాలము మి మ్మెడఁబాయకయే యుందు ననుకొనుచు. మన్మనస్సారంగ మాయుమామహేశ్వరచరణారవిందవిహార మొనర్చుచుండ నిమిత్తమాత్రచైతన్యముగలనాశరీరము మీయొద్ద నున్న నేమి? లేకున్న నేమి? ఇది యిటుండ నింకొకటి చిత్తగింపుఁడు ఈశరీర మనుచర్మపుతిత్తి ద్వారములతో, నాడులతో, నరములతో, నెముకలతో, రోమాంచములతోఁ, గవోష్ణరక్తప్రవాహముతో, బలిష్ఠమై సుందరమై లాఘవమై విశాలమై యున్నను పంచప్రాణములం గల్గి యున్నం గాని ప్రయోజనకారి కాఁజాలదు. ఆపంచప్రాణములకు పృథివ్యాపస్తేజోవాయురాకాశము లనుభూతపంచకసంబంధమైనవై యుండును. అట్టిశరీరము నశించినప్పుడాభూతము లాయాస్థలాంతరముల నలంకరించును. అందుచే జీవాత్మకు మాత్రము నాశ ముండదు. ఆపంచభూతములే పవిత్రములైన మీశరీరములందును నాశరీరమందును సమస్తచరాచరంబులయందును వర్తించుచుండుటచే నే నగపడకున్నను మీలో నైక్యమై మిమ్ము సేవించుచునే యుందును. ఇ

దియంతయు మీహృదయములనాటినదే యగుట (జింతింపవలసిన యగత్య మేమి? నే నేల మరణింతు నని విచారించెదరు? నిశ్చలత పస్సమాధియందుండువాఁడెన్నటికిని నశింపఁడనియోగశాస్త్రములు ఘోషింపుటలేదా? కైలాసాచలమున కేఁగి చంద్రమౌళీశ్వరు దర్శించిసాష్టాంగనమస్కార మాచరించి నప్పు డాపరమేశ్వరచరణసరోజస్పృశ్యచేఁ పవిత్రీభూతమైన మదుత్తమాంగము మృత్యువునోటఁ జొప్పింపఁ బోవుచుంటినా? (అనుబంధము--24)

మృకం:—మరుద్వతీ! కుమారుఁడు వచించినవిషయములం దొక్కటియుఁ దీసిపోవునది లేదు. భగవంతునిపై భారముంచి యాశీర్వదించిపంపుదము. ఇంతకంటె మన మే మొనరింపఁగలము? విచారింపకుము (కుమారునితో) తనయా! పిపీలికాది బ్రహ్మపర్యంతవ్యాప్తుఁ డగు సర్వేశ్వరుఁడు నిన్నురక్షించుగాఁక.

మార్కం:—తల్లీ! నీయాజ్ఞం గూడ దయసేయుము.

మరు:—(దుఃఖముతో) అయ్యో! ఇం కేమిచేయుదు? నా ప్రాణములు, చలించుచున్నవి. నర్వప్రపంచము నాకనులకు దుఃఖమయమైకనుపించుచున్నది. ఓభగవంతుఁడా! వృద్ధులము. చిరకాలమున కీకుమారుఁ గనినారము. ఇతనికన్న వేరుదిక్కును లేనివారము, త్రుటికాలమేని సుతునివిడనాడి బ్రతుకలేనివారము మునిదంపతులము మాపై నించుక దయయుంచుము దీనజనావనుం డనబిరుదుఁగలాడవు. ఓతల్లీ! భక్తజనకల్పవల్లీ! శాంకరీ! నీ వీకుమారు నొసంగునాఁ డల్పాయుష్కుఁ డగుట కేను జింతింప నారు వోసినవాఁడు నీరు వోయ కుండునా ” యని యోదార్చినదయారసభగతవు. అట్టినీచరణముల నమ్మి సమ్మతింపవలసెఁ గాని లేకున్నఁ బుత్రవిశ్లేషణము సహింప దరమా? నీవెఱుంగవా? ఇతఁడునీబిడ్డఁడు గాని నాబిడ్డఁడు గాఁడు. నీవే శరణ్యము. ఈయాడుకూయి యొకింత యాలకింపుము లేదా నన్నంత మొందింపుము.

మార్కం:—తల్లీ! నీవూరడిల్లక తప్పదు (అనుబంధము. డైలాగ్ 25)

మరు:—హా! కుమారా! ఎంతలో సర్వసంగపరిత్యక్తుఁడవైతివి! ఓయా శ్రమమృగంబులారా! మీచెలికాఁడు సకలసుగుణాలవాలుఁడు, మార్కండేయుఁడు, మీ రెల్లరాశ్వీరదింపుఁడు. ఓవిశ్వామిత్రవసిష్ఠనారదాదిమునిచంద్రులారా! మీ రెల్లరు దీవింపుఁడు. ఓసిద్ధులారా! సురలారా! మాతనయునిఁ గాపాడఁ బ్రయత్నింపుఁడు. ఓశంకరా! ఓశంకరా! ఓభార్గవీ! ఓకుమారా! హా! మోహాము! ప్రాణము. తనయుఁడు. తపము. దుర్భరము. దుర్భరము. దుర్భరము.

(నేలపైఁ బడును. తెర వాలును)

(ఇచ్చట ప్రేక్షకజనవిరామము)

(అరణ్యప్రదేశము మార్కండేయునిప్రవేశము)

మార్కం:— (అనుబంధము 26)

ఔరా! పరమేశ్వరులీల లెంతచిత్రములు! ఎంతదురవగాహాములు! నేను జన్మించిన దొకపర్ణశాల! కనినవారు పరమతపోనిధానులు! విద్యాలోసంగియవివేకాంధకారముఁ బోఁదోలిన దేశికుఁడు తిరస్కృతవాచస్పతియనం దగు కణ్వఋషి; దర్శించినవి సత్యలోకకైలాసములు. తపోమార్గదర్శులు విశ్వామిత్రవసిష్ఠనారదులు! భజింపఁబోవునవి నిఖిలలోకకల్యాణకరంబు లగు శంకరునిచరణంబులు! నడచుచున్నదరణ్యామార్గము; ప్రాయమా! పదియాఱవవత్సరము ప్రవేశించినది! సహావాసులా ప్రస్తుత ముండరామిఁ గోరఁదగదు. పోనిమ్ము. దైవమే తో డనుగట్టినమ్మకమున నేఁగుచున్నను ఈమార్గమిచ్చటినుండి నాల్గుభాగములుగాఁ జీలిపోయె. ఏతోవ యెచ్చటి కేఁగునో తెలియదు. తెలుపువారును లేరు. ఇ దంతయు భగవన్నిర్మాణముగాక యితర మగునా? దీనింబట్టి చూడఁగా దరచినకొలఁది వెన్న గట్టిపడునట్లు, శ్రమకు సహించునిరాఘభక్తిచేఁగాని జన్మరాహిత్యము

దొరక దనునీతివాక్యము స్మృతికిఁ దగులుచున్నది. అట్టినిర్మలపదవి సమకూర్చుటకే భగవంతుఁడు తనభక్తులగువారి కనేకసంకటము లఁ గూర్చుచుండును. ఏబాధలకైన నోర్చి మనోవాక్కాయకర్మలచే సర్వము భగవదర్పణముగా నెవరు సంచరింతురో యట్టివారే ధన్యులు. మృత్యువునైతము వారి డాయఁ జాలదు. నేనిప్పుడు సదాశివు సేవింపఁ బోవుచుంటిఁ గాన నయ్యీశానుఁడు నివసించుప్రాగుత్తరదిఙ్మధ్యగాఁ బోయెడి నీబాటనే చని నారదాద్యుపదేశము నేరవేర్ప నుపక్రమించెద. (భగవంతు నుద్దేశించి) ఓదయాసముద్రా! పరాత్పరా! శంకరా!

మ. తలిదండ్రుల్తనయాయటంచుఁ గడువం ♦ తన్ మున్గి శోకింపవారల నట్టే డిగనాడి పాప మనుచున్, ♦ రవ్వంతయోజింప నైతిలలిన్ నీ వరపాదపద్మములయం, ♦ దే చిత్తము న్నిల్పితిన్ మల యింపన్ బడఁజాల దర్శనము ని, ♦ మ్మా! భక్తసంరక్షణా!

(నిష్క్రమించును)

(ప్రవేశము నారదుఁడు)

(భజగోవిందం)

ఓదయామయా! సకలవేదస్వరూపా! విశ్వరూపా! పరాత్పరా! నీచరిత్రెంతవారికిని వర్ణింప నశక్యములు గద! నిను నమ్మక చెడిపోయెదరు గాని, నమ్మినవారికిఁ గొంగుబంగరువుంగద! ఏది నీచిద్విలాసము గాదు? నీ వెందుండవు? అట్లే కానిచో శ్రమలకు సహించి ఘోరారణ్యములం బడి పోవుచున్నమార్కండేయునకు మార్గమధ్యన మృత్యుంజయేశ్వరుఁ డనులింగాకారమున సాక్షాత్కరించి సేవఁ జేయించుకొందువా? ఈమూలమున నా కోగిరము లభించునా? ఇదంతయు, వాచా మగోచరుండవగు భవత్సంకల్పము. నే నింక యమాలయమున కరిగి మార్కండేయునిజోలికిఁ బోవల దనియు

రక్షింపు మనియు, జాలి జనించునట్లు జెప్పి యాతఁ డంగీకరింపనిచో గతించినవృత్తాంత మంతయు నెఱింగించి అలుకఁ బుట్టించి యీతకు ఱ్ఱవానియొద్దకు రప్పించెద. అప్పుడు తనభక్తుని బాధించుట కేతెంచినప్రేతనాథు వారించుటకై శంకరుఁడు స్వస్వరూపమునఁ బ్రసన్నుఁడై మునిబాలకు రక్షించి, యముని శిక్షింపక విడువఁడు. అస్మదాదుల కప్పుడు గాని పూర్ణముగ నానంద మొదవదు. ఈవిషయమునఁ గాని కలహాభోజననామధేయము సార్థకతఁ గాంచదు. నిరుపమానభక్తాగ్రేసరుఁడును శంకరవరప్రసూతుఁడును నగు నీడింభకుఁ డీయెడనే యుండి నిర్దుష్ట మగు నీశ్వరారాధన నెరవేర్చుచుండుఁ గాక. కర్తవ్యమున కేఁగెదను.

(భజగోవిందం) (నిష్క్రమించును)

(తెర యెత్తగాఁ స్ఫటికలింగాకారము మార్కండేయుఁడు గనంబడును)

మార్కం:— (అనుబంధము-29)

ఓతండ్రీ! అమృతకంఠేశ్వరా! నాపై నింకను దయరాదా! భక్తపరతంత్రుఁడవే! నీభక్తులై నాతలిదండ్రులైన వృద్ధులయెడ నేని జాలిఁ దలంచి నన్ను రక్షింపుము నేను నీపుత్రుఁడను గానా? కుమారునిపరితాపము గాంచుచుండియు, జగదేకరక్షకుఁ డగుజనకుఁ డూరకున్న నింకనాబిడ్డని కెవరు దిక్కు? సకలదిక్కులనుండి "రక్షకుండొక్క శంకరుడే" యని విన వచ్చుచుండ నింకెవ్వరి సేవింతు? మఱియు నోయీశ్వరా?

సీ. ఆకాశ గోళమం ♦ దవతరించి వెలుంగు,
లలితమౌ నక్షత్ర ♦ ములనుగాని,
గంగాతరంగసం ♦ ఘాతాంతరోద్భూత
విస్ఫురచ్ఛీకర ♦ వితతిఁగాని!
శత్రురాట్పృయపర ♦ స్వరవిజృంభిత దారు
ణాగణితాశుశ ♦ రాళిఁగాని,

వర్ణనాతీతదు ♦ ర్వారవర్ష సమయ
హారిసద్వర్ష ధా ♦ రాళిఁ గాని,
గీ. చేరి లెక్కింపవచ్చున ♦ చింపవచ్చుఁ
గాని, సర్వామరశ్రేణి ♦ కైన నీదు
మహిమలెన్నంగదరమె? యు ♦ మామహేశ!
భక్తజనపోష! సర్వేశ! ♦ భవవినాశ!

శంకరా! శివా! నినునమ్మినవారి కేలోపమును రానీయవని వేనోళ్ల నాలకించితి. నిన్నాశ్రయించితి. శిశుస్త్రీగోభూసురహత్య లొనరించు పరమపాతకులైనను శివా యను నీపవిత్రనామాక్షరద్వయ మొక్కమారు నోరారస్మరించినంతనె సకలమహాపాపములఁ బటాపంచ లొనరించి సద్గతు లొసంగుదువట అట్టి పతితపావనబిరుదము గల లోకరక్షకుండవు నన్నేల బ్రోవవు? ఏల నామొ రాలకింపవు? ఓగంగాధరా! నా కీతుచ్ఛశరీరముపై నాసలేకున్నను జీకు లగుతలిదండ్రుల కొఱకపేక్షింపవలసె. నీవు కరుణార్ద్రదృష్టుల నన్ను గారవింప వేని కుమారునికై యడలి యడలివా రట్టె నశింతురు. కావున నోదేవా! వారిప్రాణంబు లుండునంతవఱ కేని నన్ను మనుపుము. నీవొసంగిన యాయుఃప్రమాణము నేటితో సమాప్తము గాఁబోవుచున్నది. యమభటు లరుదెంచి కొంపోఁగలరు. ఓయార్తజనశరణ్యా! నిన్నే నమ్మితి. నిన్నే ధ్యానించితి. రక్షమాం! రక్షమాం రక్షమాం (అని కనులుమూసి ధ్యానించుచుండును)

(ప్రవేశము ఇద్దఱు యమభటులు)

1-భటు:- అతఁడే మార్కండేయుఁడు సమీపించి ప్రభునాజ్ఞ నెరవేర్పుదము.

2-భటు:-దీర్ఘకరా! కింకరవృత్తి జరింపవలసినది నిజమేయైనను, తదేకధ్యానమునను్న వాని నియతికి భంగముఁ గలిగించు టపాయకరమేమో?

1-భటు:-అపాయమా? ప్రచండదండధరుని కింకరుల మగుమనమిట్టు శం

కింపవచ్చునా? నీకు సందేహమైన నావెనుక నుండుము. నేను ముందుండి పలుకరించెదను (అనిసమీపింపబోయి వెనుకకు దగ్గి) ఆహా! ఏమిది? వేడిగాడ్పులు వీచినట్లు శరీరమున తాపాటము గలుగుచున్నదే! ఇది యీతనితపఃప్రభావ మగునా? (ఆలోచించి) అగుం గాక. ఇచ్చటనుండియె పలుకరించెదను. (ప్ర) ఓవిప్రకుమారా! నేటితో నీయాయుర్దాయము చెల్లిపోయినది. మాయేలిక యుత్తర వుప్రకారము యమపురంబునకు బోవ బయలుదేరుము.

మార్కం:—(ధ్యానమునే నటించు చుండును)

భటు:—ఓయీ! కదలి రావేమి? మాటాడవేమి! ఆలస్యమునకు సహింపము. నిన్ను విడువము. లే లేచిరమ్ము.

మార్కం:—(కనులు విచ్చి చూచి) (స్వ) ఓహో! వీరు యమభటులు కాంబోలు (ప్ర) యమదూతలారా! దేవతారాధన పూర్తి యగునంతవఱ కాంగుండు. నన్నుం దొందర పఱపకుండు.

భటు:—ఆంగుట కెంతమాత్రము వీలు లేదు. నీవు చెప్పినట్లు నిలచి యుండుటకు నీనౌకరులము గాము.

మార్కం:—సగముపూజ యైనది, మిగిలినది త్వరలో ముగించి వచ్చెద నుండుండు.

భటు:—వీలు లేదు. ఈరాతినిం బూజించిన నేమిలాభము? తక్కినసగము మాప్రభువున కర్పింతువు గాక. లేంచి రమ్ము.

మార్కం:—ఔరా! ఏమిటి కానోటిదురుసు? మీప్రభువు మిమ్మాయవ్యక్తపుమాట లాడుట కేపంపెనా? సేవకులవాక్పారుష్యము ప్రభు మర్యాదలం గలంగింప కుండునా? మీరు దూత లగుటచే శాంతింప వలసె. నింక నిట్టిదుండగముల నాచరింపక దేవతార్చన యగు నంతవఱకు నిలువుండు. కా దేని మీనేతను డాసి ''భగవత్సేవకు భిన్న మాచరింపం జాల" నని విన్నవించితి నని తెలియంజేయుండు.

భటు:—ఓయీ! డింభకా! పిట్టకొంచము కూతఘనన మని నట్లు

జానెఁడు లేవు! మమ్ము క్షమించువాఁడవా? మాదర్శన మైనంత నె సకలప్రపంచమును గడగడ వడంకుచుండ నీవేమో నిర్భయము గ మాట లాడెదవే మాగదాముద్గరపాశంబులపాలయ్యెదవు సుమా! జాగ్రత!

మార్కం:—(స్వ) ఆహా! మూర్ఖులమొక సామవాక్యములు నిష్ప్రయోజనము లగుఁగద (ప్ర) ఏమీ! మీరా? నన్ను బాధలఁ బెట్టువారు? మీయాగ్రహము సకలలోకసంక్షోభకారణమా? ఔరా ఏమీ వాగ్విజృంభణము?

శా. దంభంబుల్ పచరించి భీకరగదా ◆ దండప్రహారక్రియా
రంభత్వంబునభీతిఁ గొల్పి బలగ ◆ ర్వస్ఫూర్తి గొంపోవఁగా
సంభావించితి రేమొ? యేటికి వృథా ◆ సందర్భముల్ సాగునే
శంభుం గొల్చెడువారిపట్లఁ జనుఁడీ ◆ శంకింపకుండన్ వెసన్.

1. భటు:—ఔరా! ఏమని ప్రేలితివి? మాది వృథాప్రయాసమా? నిన్ను గొంపోఁజాలమా? నీశంభుని గింభుని లెక్కసేయము. పూజాద్రవ్యములు గీజాద్రవ్యము లావల బాఱవైచి నిన్నీడ్చుకొని పోయెదము. నీ కెవ రడ్డము వచ్చెదరో చూచెదము గాక. సిగ్గులేని పిరికిజంగము గొలచుటచే మత్తెక్కి మమ్ముఁ దృణీకరించెదవుగా?

మార్కం:—ఓరీ పాపిష్ఠీ! నన్ను నిందింతువు గాక పాంచభౌతికప్రపంచమంతయుఁ గలసమస్తచరాచరంబులకు నాధారభూతుఁ డగుమహాదేవునిం గూడ దూషించుచుంటివే మూర్ఖా! ఫాలాక్షుని నిందించుట ఘోరపాతకము సుమా? తూల నాడకుము. నేను మీబిభీషికలకుఁ జడియ నని నమ్ముము.

సీ. చటులదంష్ట్రాగ్రవి ◆ కటకరాళుర మిమ్ము
గని భీతిఁబడ దుష్ట ◆ జనుఁడగాను
ఘంటానినాదభీ ◆ కరగదాహతులకు
వెఱఁ గంది కుందఁ గా ◆ వెకలి గాను

తతదయాహీనసం ♦ గతదుర్భరార్భటుల్
సరకుసేయగ ♦ నీచనరుఁడగాను
త్వత్ప్రాశబద్ధవి ♦ హ్వాలుఁడనై భాధఁ ద
ప్పించుఁడీ! యని యాశ్రి ♦ యించఁ బోను

గీ. ఎవ్వనిగ నెంచినారో? మ ♦ హేశశంక
త్రిపురరక్షస్సమూహాభూ ♦ రిప్రతాప
మారణోద్దండనేత్రాగ్ని ♦ మండలునకు
నాత్మభక్తునిఁగా మది ♦ నరసికొనుఁడు!

1. భటు:—ఓరీ! గర్వోన్మత్తవ్యర్థప్రలాపి! నీవంటిభక్తులను వేలకువేలు చూచితిమి గాని గర్వించి పేలెడువానిమాత్ర మీవఱకెఱుంగము. నీరుద్రునివిషయమై మాకడ బలుకకుము మే మించుకేని సరకుగొనము. లేచి రమ్మా.

మార్కం:—(స్వ) ఛీ! ఛీ! ఈదుర్మార్గులతో మాటలాడఁగూడదు (మఱలలింగము డాసి) తండ్రీ! సర్వేశ్వరా! ఇనుమునుఁబట్టి యగ్నికిని సమ్మెటపెట్టనట్లు నన్ను గుఱించి నీవీనీచులచేఁబడరానిపల్కులఁబడవలసి వచ్చెగద! దీనికి నేను కారణుండ నగుటచే నన్ను క్షమింపుము (అని నమస్కరించుచుండును)

1. భటు:—నిన్నుఁ క్షమించినను శిక్షించినను మాప్రభు వగుయమధర్మరాజునకే చెల్లును గాని తదితరులచేఁ గాదు. నిరుపమానపరాక్రమైకదక్షుండును దుర్నిరీక్ష్యుండును నగుకాలుని సామాన్యుఁ డని తలంచుచుంటివి కాఁబోలు? జాగ్రత!

మార్కం:—నమస్తే శంకరా! శివా!

1. భటు:—ఔరా! యేమినీతలపొగరు! ఏమి నీకండకొవ్వు! ఏమి నీతిరస్కారము. ఇంచుకయు వెఱవ కుంటివే?

మార్కం:—ఓయీ! జ్ఞానశూన్యప్రలాపి! మితిమీఱి దుర్భాష లాడకుము. వినుము.

ఉ. బాల శశాంక మౌళి సిర ♦ వద్యకళాపరిపూర్ణమూర్తి గౌ
రీలలనార్పితార్ధసుశ ♦ రీరుఁ డనంతదయార్ద్రనేత్రోల్లస
చ్ఛీలుఁ డరాతిభీకరుఁడు ♦ శ్రీధరుఁ డాత్రిపురాంతకుండు నా
పాలిటనిల్చియుండ వెఱ ♦ వంగఁ బ నేమిటి కింకఁ జెల్వుఁడీ.

మాఱుమాటాడక వచ్చినతోవనే చనుఁడు (అనిలింగమును డా
సి పూజాద్రవ్యములచే నర్చించు చుండును)

2 భటు — ఓమార్కండేయ! నీయీవర్తనము ప్రస్తుతమున కనుచితము. ఇదియును గాక దారాసుతుల దూరీకరించి లోకులు నవ్వుదు రనియైనఁ దలంపక యొక యంగనను నెత్తిపై నెక్కించుకొని నిరంతరశ్మశానసంచారుఁ డైన కొండవీటిజంగమభీరువును కౌగలించుకొనుటవలన లాభము లేదు. ఎంతశాంతముగ బలుకుచుంటిమో యూహింపుము. మమ్ము శ్రమబెట్టకుము. నీవు శ్రమబడకుము.

మార్కం:—ఓరిమూర్ఖుడా! యెంతయవివేకముగ బలికితివి! ఎవరురా నీ కీయుద్యోగ మిచ్చినది? యెవనివలన సర్వప్రపంచము సృష్టింపఁబడు చున్నదో యెవనివలన బోషింపఁబడుచున్నదో యెవనివలన లయ మగుచున్నదో యెవనినామస్మరణమాత్రమున మహాపాతకములకు వెలియై సకలప్రాణులు సద్గతులఁ బొందుచున్నవో త్రికరణశుద్ధిగ సర్వసంగపరిత్యక్తులై భజించువారిహృదయపీఠములే తన యాస్థానముగానెవ్వ రధిష్టించినో నిత్యానిత్యవివేచనజ్ఞానులజ్ఞానచక్షువుల కే పరాత్పరువాగమ్యశకరణంబు లానంద మొసంగునో ప్రకృతి సర్వస్వమునందు లీలామాత్రముగ నెవఁడుగోచరించునో సర్వేశ్వరుఁ డయ్యు గుమ్మరిపురుగుపగిది నంటీయంటనివిధమున నిష్కళంకవిరాజమానమానసియచరిత్రుఁ డై యెవ్వఁడాజ్ఞామాత్రముగ జతుర్దశభువనములఁ గను పెట్టుచుండునో యట్టిజగజ్జనకుని నిందించెడిపాపి! ఇటువినుము:-

సీ. నిరుపేదవాఁడు శం ♦ కరుఁడౌనె? యైశ్వర్య
మీశ్వరాధనమై ♦ యెసఁగుచుండఁ
బిరికివాఁడెటులౌను ♦ పురదైత్యులనుబట్టి
చండాడినట్టిరు ♦ ద్రుఁడతండు
జారవర్తనుఁడె ని ♦ ష్కాముఁడై మృత్యువు
నరిఁగట్టిగెలిచిన ♦ స్మరహరుండు!
ఆలుబిడ్డలఁబాసి ♦ నట్టిసన్న్యాసియే
యర్ధనారీశ్వరుఁ ♦ డైనవిభుఁడు.

గీ. తెలియరామి వచించితో ♦ తెలిసియుండి
చెనటివర్తనమునసె భా ♦ షించి నావా!
తెలియకున్నను హరుని నిం ♦ దించిరేని
ఘోరపాతకమైకట్టి ♦ కుడుపుసుమ్ము!

మాటిమాటికి నానియమమునకు భంగమొదవించి నాకోపాగ్నికిం ధనములు గాకుఁడు. ఈశ్వరభక్తు లనసామాన్యు లనితలంపకుఁడు.

1. భటు:—ఛీ! దుర్మతీ! ఇంకనుపోయెద వేమి. బలాత్కారముగ నీడ్చి కొనిపో మ్మందువా? ఇప్పటి కేని లేచి వత్తువా?

మార్కం:—ఓరోరి తమోగుణప్రధానులారా!

గీ. అలరు పన్నీటికాల్వల ♦ కెలకులందు
మంచికస్తురిపాదులఁ ♦ బెంచునట్టి
యుల్లిమొక్కలదుర్గంధ ♦ ముడుగదనెడి
సామ్యమిట స్వానుభవమున ♦ సార్థమయ్యె.

1. భటు:—ఛీ? తలువా! (అతనిమీఁదికిఁ బోవును)

మార్కం:—(తొలఁగి) ఆ! పాపీ! దుర్మదాంధా! నన్నంటవచ్చెదవా! (లింగమునకైకి) ఓశంకరా! ఓపంచభూతములారా! సూర్యాదిగ్రహంబులారా! నాపైదోషారోపణంబు జేయకుందురుగాక.

(అనిగుప్పెడువిభూతి వారలపై విసరును)

భటులు .1 & 2:—బాబో! నాయనో! మంటలు. మంటలు, ప్రళయాగ్ని. ఓయమధర్మరాజా! రక్షింపుము. రక్షింపుము

(అని గంతులు వేయుచు నిష్క్రమింతురు)

(తెరపడును)

(ప్రవేశము నారదుఁడు)

భజగోవిందం

ఆహా! చింతితార్థప్రదాయకుఁ డగుభక్తవత్సలుని కృపాకటాక్ష మెంతకుఁజాలదు? మాయాతీతుఁడయ్యు నామాయకు లోఁబడి యుం డునట్లు నటించుట మస్తభూతి తర్బహిర్వ నలము మని చాటుటకుఁ గద! (భగవతు నుద్దేశించి) ఓహో నారాయణా! జనార్దన కరా! పరాత్పరా!

మ. భవపాశానలకీలలం బడి మరా ♦ సంబైన దైన్యంబుచే
నవయన్ లేక త్వదంఘ్రియుగ్మము సదా ♦ యాత్మస్థితిన్ నిల్పి వే
ఱెవరున్నారలు? నన్నుఁ బ్రోచుటకు నీ ♦ వే! నీవె! నీవే! యటం
చెవఁ డార్తిన్ దపియించు నాతనిమనో ♦ భీష్టంబుఁ జేకూర్పవే?

నే నింకఁ ద్వరబడి దూతలకంటె మున్నుగ యమునికడ కేగి ప్రసంగించెదఁ గాక.

భజగోవిందం

(నిష్క్రమించును) (ఇదివిష్కంభము)

“శ్రీరామచంద్రపరమాత్మనే నమః”

మార్కండేయ నాటకము.

షష్టాంకము

(తెరయెత్తఁగ: యముఁడు, చిత్రగుప్తుఁడు, నలుగురుభటులు, యమలోకము గనుపించును)

యము:--చిత్రగుప్తా! మదాజ్ఞానువర్తనంబున నప్రమత్తుఁడవై యుంటివా?

చిత్ర:—చిత్తము. తమశాసనంబున కడ్డుండునా?

యము:—నేఁ డెవరి నైన రావించితివా?

చిత్ర:—చిత్తము. నలువురకు శిక్షలు విధింపవలసి యున్నది. వారి నింతకుమున్నె మనభటులు గొనివచ్చిరి.

యము:—మంచిది. విచారించెదఁ బిలిపింపుము.

చిత్ర:—చిత్తము. (భటులతో) కింకరులారా! మీరు కొనివచ్చిననల్వురి నిటు తెండు.

భటు:—చిత్తము స్వామీ! (నిష్క్రమించి ప్రేతలతోఁ బ్రవేశించి) దేవా! వీరుగో ప్రేతలు.

యము:—చిత్రగుప్తా! వీరిచరిత్రలు వినిపింపుము.

చిత్ర:—(పుస్తకముఁ జూచుచు) దేవా! ఇతఁడు (అని వ్రేలితోఁ జూపుచు) నిరతధర్మబాహ్యుఁడై లెక్కింప నలవిగానిఘోరపాతకము

లాచరించుటయే గాక భగవంతునిం గూడఁ దిరస్కరించినపరమ కిరాతుఁడు.

యము:— (పేరితతో) ఓయీ! ధర్మబాహ్యమే కాక, నిరీశ్వరవాదము గూడనా? దండధరుఁ డున్నాఁ డనియైనఁ దలంపవైతివా? ఛీ! ఛీ! నాయెదుట నిలువకుము. (భటులతో) భటులారా! మీరీతనిఁ గొంపోయిప్రథమమున సలసలగ్రాగుతైలమున ముంచుఁడు.

భటు:—చిత్తము ప్రభు! (లాగికొని పోదురు)

యము:—చిత్రగుప్తా! వీఁ డేలాటివాఁడు? (రెండవవాని నడుగును)

చిత్ర:—దేవా? వీఁడు, జన్మాంతరసుకృతమున భూసురుఁడై జన్మించి చండాలునికన్న నీచముగ సంచరించి తనవలెనే పెక్కుర కుపదేశించి నడపించినవాఁడు

యము:—ఛీ! ఛీ! గురుస్థానమునం దుండవలసినదానికి మాఱుగ నితరులఁ జెరచుటచే యమదండనలన్నియు ననుభవింపవలసినదే! (దూతలతో) ఓరీ! మీ రీలోకద్రోహిని మూత్రపురీషాదికూపమునఁ నుంచుఁడు.

భటు:—చిత్తము. (తీసుకొని పోదురు)

చిత్ర:—దేవా! ఈమూఁడవ యతఁడు జననీజనకులను భార్యాబిడ్డలను హింసించి నిరంతరపరదారాపేక్షకుఁడై తుద కవసానకాలమున కొకమాసము క్రిందట వేఁడుకుంది బ్రాహ్మణుల కన్నదాన మొనర్చినవాఁడు

యము:—(మూఁడవవానితో) ఓరీ! మూఢుఁడా!

ఉ. తల్లినిఁ దండ్రి సంతతిని ♦ దారల దుఃఖములోన ముంచినీ
తల్లికి సాటివచ్చుఁ బర ♦ దారలఁ బట్టి బలాత్కరించి యా
పల్లవపాణులం జెరచు ♦ పాప మొనర్చినద్రోహచిత్త నీ
యుల్లమదెట్లు బ్రాహ్మణుల ♦ కోగిరముంసమకూర్పనొప్పెరా?

ఈసత్కర్మాచరణమహాఫలంబున పూర్వమొనరించిన పాతకములు హరించు నని తలంచితివో? "పాపపుణ్యములు రెండును ననుభవింపవలసినవే" యని తెలియదా? (కింకరులతో) సేవకులారా! ఇతఁడు పరమదుర్మార్గుఁడైనను, దానములలో నెల్ల నుత్తమంబగు నన్నదాన మాచరించెఁ గానఁ బాపకృత్యములకు దగుకరపదతాడనాగ్నిస్థంభాలింగనశిక్షల నెరవేర్చి పిదప నాపుణ్యఫలమనుభవింప నుత్తమలోకంబున కంపుఁడు.

భటు:—ప్రభూ! చిత్తము. (కొంపోదురు)

చిత్ర:—దేవా! యీనాలవవాఁడు కొన్నిగ్రామముల కధిపతియై పరిపాలనధర్మము వమ్మొనరింపఁ బ్రజలలోఁ గలవరము కలిగి దుర్మార్గములు పెచ్చుపెరిగి తద్దోషఫలమునైత మీతనిఁ జేరుటచేఁ బాపమీరూపమున నవతరించె ననుటకు నిస్సందేహముగ నున్నది.

యము:—ఆహా! ఎంత ఘోరము? ఐశ్వర్యమదోన్మత్తత పరులసౌఖ్యముం గూడఁ బాడొనరించుఁ గద! (దూతలతో) భటులారా! మీరీతనిఁ గొంపోయి ఖరవాహనంబునఁ బట్టణం బంతయునూరేగించి రండు. పిమ్మట శిక్షించెదను.

భటు:—చిత్తము. (నెట్టుకొనిపోదురు)

యము:—చిత్రగుప్తా! ఇంకేవియేనిఁ గలవా?

చిత్ర:—ప్రస్తుత మేవియు లేవు. మార్కండేయునికొఱకు పంపఁబడినవారిఁకను రాలేదు. వచ్చిన మనవిఁ జేసికొందును.

యము:—మంచిది. ఋషికుమారుఁడగు నతఁడు భగవత్సేవకుఁడగుట సామోపాయంబునఁ దీసికొనిరండని దూతలతోఁ జెప్పితివా?

చిత్ర:—చిత్తము. అట్లే వచించితి.

భటు:—(ప్రవేశించి) మహాప్రభూ! నారదులవారరుదెంచుచున్నారు.

యము:—సుకృతము. తదాగమనమువలన శుభమగుగాక.

నార:—(ప్రవేశం) భజగోవిందం

యము:—(సింహాసనము దిగి యెదురుగాఁ బోయి) ఋషిచంద్రా!
నమస్కారము. దయచేసి యాసీన మలంకరింపుఁడు.

నార:—శుభంభవతు. శుభంభవతు. (కూర్చుండును)

యము:—దేవా! దేవరదర్శనమున ధన్యుఁడ నైతి.

ఉ. మానితవర్తనుల్! విధికు ♦ మారులుసాధుజనాగ్రగణ్యులున్
గానకళాప్రపూర్ణులు జ ♦ గత్త్రయవంద్యులు ధర్మమార్గసం
ధాను లుదారమానసులు ♦ ధారుణిపైఁ గలవార్తలెవ్వియో
వీనులవిందొనర్చి శ్రమ ♦ బెట్టుట నెమ్మది నుండఁ బోకుఁడీ.

నార:—యమధర్మరాజా! నేను లోకత్రయసంచారి నగుటచే, నా కెఱుఁగరానివిషయ ముండ దని నెల్ల రిట్లకోరుచుండుటయు సమయమునుఁ బట్టికోర కున్నను నేనే తెలియఁజేయు చుండుటయు సహజమై యుండ నీవు శ్రమఁ బెట్టుటేమున్నది? ఇప్పుడు నే నొక కార్యార్థినై వచ్చితిని. నీ వది మన్నింతు వని నమ్ముచున్నాను. పరమధర్మము. మహోపకారము.

యము:—మహానుభావా! అది యేదియో సెలవిండు.

నార:—సావధానుఁడవై యాలింపుము. భూలోకంబునమృకండమరుద్వతు లనుమునిదంపతులకు పదియాఱువత్సరము లాయుఃప్రమాణము గలకుమారుఁ డుదయించి యుండుటయు నేటితో గడువు తీరు ననుటయు నీ వెఱింగినవిషయమే కద! అందుచే నాకుమారునికై విలపించువృద్ధదంపతులఁ గాంచి జాలిఁ జెందినవాఁడ నగుట నీ వాతనిజోలికిఁ బోవల దని నిన్నర్థించి సంకల్పసిద్ధి వడయుటకై నీ యాస్థానమున కేతెంచితి. సకలధర్మపరిజ్ఞానముఁగలిగి "సమవర్తి" యని పిలువంబడునీవు కలహాభోజనుఁడ నైనను బ్రస్తుతమునం దుపవాసమున కోర్చి పల్కెడునాపల్కులపై విశ్వాస ముంచి యేకపుత్రవిషయ మాలోచించి రాక రాక వచ్చిననా యాగమనముఁ దలంచి మదభీష్టముఁ జెల్లింపుము. సకలజగములందు నిరుపమానకీ

_ర్తి నార్జింపుము. ఎవరినిఁ గాని దేనిని గాని యెన్నఁ డర్థించి యెఱుఁగను. నీకుఁ దెలియని దెందును లేదు. నూఁర మాలోచింపుము.

యము:—తాపసోత్తమా! యీలాటితల్లిదండ్రిలు, కుమారులుఁ బ్రపంచమున నెందరో కలరు! అట్టియెడ వీరివిషయమున జాలిఁ దలంచితి నేని యిల్లే యెంద రర్థింతురో వారి నాదరింపకున్న నెంతగ దూషింతురో భయభక్తు లెంతగ నశించునో లోకు లెంతనిందింతురో తమచిత్తమునఁ దలఁపుఁడు. మఱియు,

చ. గురుకరుణాలవాల నను ♦ గోరఁగఁ జెల్లునటయ్య? యింతదు
ర్భర మగుకోర్కె నాపయి నె ♦ పం బిడఁబోకుఁడుధర్మశాస్త్రవి
ద్వరులు హసించి దుర్గుణుఁడి ♦ తం డని నింద యొనర్పకుందురే?
నరకము సంఘటిల్లదె? చ ♦ నందగదే? సమవర్తనంబునన్
నన్ను మన్నింపుఁడు. నాదూతల నీవలకే పుచ్చితి.

నారద:—యముఁడా! యీమాత్రము నాకోరికఁ జెల్లింప లేకపోయితివి. చెప్పవలసి చెప్పితిఁ గాని శంకరుఁ డాకుమారున కీవలకే చిరాయుర్దాయ మొసఁగి తనసేవ జేయించుకొను చుండె. నీకు వృథాశ్రమయగుఁ గదా యని యూహించినందులకు నిష్ఫల మయ్యె. పోయిననీదూతలు నేతు లాడించుకొనుచుఁ దిరుగ రావలసినదే కాని ప్రయోజన మేమియు లేదు. నీమర్యాదను గాపాడుకొనుము.

యము:—ఆ! నారదా! నాకింకరులరుగుట నిష్ప్రయోజనమా? శంకరుఁడు చిరాయువొసంగెనా! నామర్యాదఁ గాపాడుకొనవలయునా? నాకు వృథాశ్రమకలుగునా? యేమి యీవింత! యింతవిపరీత మెందైనఁ గలదా?

ఉ. ఏల పదాఱువత్సరము ♦ లే యని బాలు నొసంగువేళఁ దాఁ
గాలమునిర్ణయించె? కఱ ♦ కంఠుఁడు నేఁడుచిరాయువిచ్చి యీ
లీల నధర్మవృత్తిని మ ♦ లీమస మూని చరింప నౌనె? యీ
కాలునిఁ జిన్నబుచ్చుటకు ♦ గాఁ దలపెట్టెనె? యింత ఘోరమే!

నిరంకుశప్రతాపుఁడనై సమస్తలోకభీకరుఁడనై "సమవర్తి" యని ప్రఖ్యాతివడసిననేను, దుష్టశిక్షణంబొనరించెడునేను తలఁచుకొనినం తనె గుండెలు వ్రీలునట్టిభయంకరచరిత్రుఁడ నగునేను, వదాన్యశిఖామణి యనియు మానధనుఁడనియుఁ గొనియాడంబడునేను, నేటికీకారణమునం గలుగు పరాభవమున కిచ్చగింతునా? దండధరుఁడు న్యాయ్యుఁడని లోకము నిందింపదా? నిందమాట యెట్లున్నను ధర్మబాహ్యమున కనుమతింతునా? కావున శంకరుఁడాతని కెట్లు చిరాయువొసంగెనో అసత్యమున కెట్లు పాల్పడెనో కనుఁగొనవలయుఁ. నిటలాక్షుఁడధర్మవర్తనుఁడయ్యె నని సమస్తప్రపంచము తనను మాత్రము దూరీకరింపదా? యియ్యది నీతియా?

33-అనుబంధము

నార:—శాంతించవోయి యముఁడా! శాంతించు. ఏలత్వరపడియెదవు? పాపపుణ్యవిచారణకై నియమింపఁబడిననీవు భువనైకశాసనుండును సకలలోకారాధ్యుఁడును నగు శంకరుఁ దృణీకరించి "నీతియా" యని ప్రశ్నించుచుంటివా? అబ్బా! యెంతసాహసికుఁడ వైతివి! పదవికి మించిననీవి సదమదించునుసుమా! భక్తపరతంత్రుఁడగును మావరుఁడు విశ్వామిత్రవసిష్ఠులచేతను నావలనను బ్రార్థింపఁబడి మార్కండేయునిభక్తికి సంతసించి చిరకాలజీవి యగునట్లు వరం బొసఁగె. అయినను న్యాయ మనుసరించి నీకీవార్త నెఱిగింప నీవే ధర్మపథగామి వైన ట్లుపన్యసించు చుంటివి. ఇప్పటికేని తీవ్రమడఁచుకొని యోజింపుము. నీ కియ్యది పరాభవకారణము కాదు. ధర్మదూష్యము గాదు. మార్కండేయుఁడపరశంకరావతారుఁడైనట్లు పొడకట్టుచున్నయది. చెప్పవలసినది చెప్పితి. నీవణుమాత్రము సంశయింపక నాయుపదేశ మంగీకరించి సుఖింపుము. నీవిభీషకలకు రుద్రుఁ డూరకొనఁడు. నీ కపాయము వాటిల్లక మానదు. మార్కండేయుని నీవేమియుఁ జేయఁ జాలవు. విడప నీయిష్టము.

యము:—ఏమి? నా కపాయము వాటిల్లునా? మీరందఱు నేకీభవించి యీ యకార్యమున కొడిఁగట్టితిరా? మంచిది. మీమీపట్టుదలలు, మార్కండేయునిచిరాయుష్యము, శంకరవాగ్దాన మే పాటికొనసాగునో చూచెదఁ గాక. ఔరా! యెంత ఘోరవిపర్యాసము! యెంతనీతిమాలినవర్తనము! ఇంతటిదుర్మార్గమునకే సమ్మతింతునా? యేమైన నగుఁగాక నేనుపేక్షింపను. (చిత్రగుప్తునితో) చిత్రగుప్తా! మార్కండేయునికొఱకు మఱియిద్దఱఁ బంపుము.

చిత్ర:—చిత్తము.

(తెరలో) యమధర్మరాజా! రక్షింపుము. రక్షింపుము.

యము:—(వినుట నటించి) ఏమిది? ఆర్తరవము వినవచ్చుచున్నది (సాభిప్రాయముగఁ దల యూచి) ఓహో! బాధకు సహింపలేని మార్కండేయుఁడు రక్షింపుమని మొఱసేయుచుండెఁ గాఁబోలు. నారదా! వింటివా? కనియెదవుగాక.

నార.—క్షణకాల మోపికసేయుము. ఎవరేది విందురో కందురో తేలఁగలదు.

(మార్కండేయునికొఱ కేఁగినభటులు ప్రవేశించి)

భటులు1 &2:—మహాప్రభూ! రక్షింపుము. రక్షింపుము.

యము:—ఏమిరా? మీ కేయపాయము వాటిల్లె?

భటు. దేవరా! తమ యాజ్ఞగా మార్కండేయున కెదురేఁగించి రమ్మన నేమేమో దూషించి మమ్ములెక్కపెట్టక పట్టెడు విభూతి మంత్రించి మాపై విసరె. నంత నది మాశరీరములపై నిప్పులవానపగిది మంటలఁ గలిగించి మూర్ఛాగతులఁ జేసె. పిమ్మటఁ గొంతసేపటికెటులో తెలివి నొంది చావుఁ దప్పి కన్నులొట్ట పోయినవారివలె నిటువచ్చితిమి. క్షమింపుఁడు.

యము:—(మహాకోపమున) ఔరా! యెంతకండకావ్రుప్వా? (మార్కం-

కమును జూచుట నటించి) ఆహా! యేమిది? సర్వాంగకములు వణంకుచున్నవి! నయనాంతర్గళితము లగునీబాష్పము లానందసూచకములా? సంతాపసూచకములా? (భగవంతు నుద్దేశించి) ఓపురాణపురుషా! నాగభూషా!

అనుబంధము—35

(కన్నులం దెరవకయే) ఓహో! యేమి యీప్రకాశము? యేమి యీ ధగద్ధగితము? యెవ్వారి దీసవ్యహస్తము? ఓహో! వ్యాఘ్రాజినపరిశోభితకటిప్రదేశము! ఫణిహారాలంకృతవిశాలవక్షము! జటాజూటాంతర్గోల్లసితబాలగంగాలహరీప్రసన్నము. నిరుపమానందసంధానపవిత్రభస్మలేపనాత్యంతసుందరశరీరము. భక్తరక్షణకళాప్రపూర్ణభాసురదృగంచలము. ఆహా! యేమి నా భాగ్యము! ఏమి నా యానందము! ఏమి నా సుకృతపరిపాకము! తండ్రీ! సకలలోకసంత్రాణశీలా! యేమి నీమందహాసము? జడియకుమని, వరదాభయహస్తముం జూపుచుంటివా? జగజ్జనకా! నీ కేపూజోపహారముల నొసంగుదు? భక్తమానసమందిరుండ వగునీ వెఱుంగనిది కలదా? యిదే నా ప్రాణమానసభక్తినిధానముల నీచరణకమలముల కర్పించితి. నీయిచ్చవచ్చినదానిం గైకొమ్ము. (అని కొంచె మాగి) జనకా! ఏమిసెల విచ్చుచుంటివి? (కొంచె మాగి) ఓహో! భక్తజనమనఃకుసుమమే నీ కువలయునా? సంతోషము. నమస్తే! నమస్తే! నమస్తే! (కనులు విచ్చి సధైర్యముగ)

శా. అక్షయ్యం బగుచిత్తవృత్తిని సమ ♦ స్తాంతర్బహిస్సంగతుం
దక్షుధ్వంసకు, ఫాలలోచనుపద ♦ ద్వంద్వంబు సేవించి ప్ర
త్యక్షప్రాభవదీపితామలకళా ♦ ప్రావీణ్యశోభామనో
దక్షత్వంబు వహించి వాఁడ నిఁక సం ♦ తాపంబు లే దెందునన్.

ఓహో! యియ్యది యహంకారవ్యక్తిస్ఫురణకారణం బగు నేమో?

యీశ్వరసాక్షాత్కారానంతరమున ద్విగుణీకృతసత్వగుణాలంకారము గదా! జన్మముఁ బరమావధి. అందుచే గర్వింపఁ జనదు. శ్యామామనోవల్లభుఁ డేతెంచిన సాధ్యమగునంతవఱకు సామవాక్యములతోఁ బ్రసన్నుఁ గావింపఁ బ్రయత్నింపవలయు. యముం డందుల కస్యథావర్తించునేని నాపాలిటిపరమేశ్వరుఁడే కలఁడు. (లింగము డాసి) ఓ కృపాసింధు! దీనబంధు! నాచిత్తమును నీచమార్గములఁ బోనీకుము (ధ్యానముపటించును.)

(తెరలో) రే! బ్రహ్మకులభారభూతా! మార్కండేయా!

శా. ఓరీ! దుర్మద! దుర్విచార! చెనఁటీ ♦ యో రోరీ పాపిష్టి! యూ
రౌరా కూ్రర! మదీయకింకరుల కీ ♦ వావంత యున్ జంక క
న్వారిన్ బాధలఁ బెట్టినా వటర? ఛీ ♦ భత్సుంతు కాలుంతు నీ
వీరత్వంబును మంటఁ గల్పు నని భా ♦ వింపంగ లేదే? ఖలా!

మార్కం:—(కరములు జోడించి)

గీ. శ్రీమహేశ్వర! యభవ! యు ♦ మామహేశ నోజ!
భక్తవత్సల! శంకరా! ♦ పరమపురుష!
ఫాలనేత్ర! ప్రశస్త! క ♦ పాల హస్త!
శరణు ఫణిహార! రజత భూ ♦ ధరవిహార!

యము—ఓరీ! మూర్ఖా! పరేతరాట్టనుభయ మించుకయు లేక కన్నెత్తి యైనఁ జూడక వాపోయెదవేమిరా? పాపాత్మా!

మార్కం:—(చూచి నిలచి) అయ్యా! నేను పాపుఁడ నగుటంజేసియే పవిత్రతకొఱకీశ్వరు ధ్యానించుచుంటి.

యము—ఛీ! ఛీ! వదరుఁబోతా! నిఖిలభూతశాసకుఁడ నగునాయాజ్ఞనుల్లంఘించి నాదూతల నేలఁ దిరస్కరించితివి? యీశ్వరు సేవించుచుంటిఁ గదా యని మదించి స్వేచ్ఛాసంచారుఁ డవైతివా? లేక

శంకరుఁ డనీతిమాలినవర్తన ముపదేశించెనా? నీ కెప్పు డెవఁ డడ్డము వచ్చునో కనుఁగొనియెద. (అని నెట్టబోవ)

మార్కం:—ఓయమధర్మరాజా! శాంతింపుము. నన్నెన్నియైన దూషింపుము. జగదేకజనకుఁ డగుశంభుని దూరకుము. అదిమహాపాపము గద. ధర్మస్వరూపుఁడ వగునీవు కించజ్ఞుఁడ నగునాచేఁ జెప్పించుకొనవలయునా? మహాత్ముఁడవు! తరతమభావవేత్తవు! సకలసద్గుణగరిష్ఠుఁడవు! సామాన్యుఁడవు గావే! నీఁ కెఱుకరాని యంశ ముండునా? నీమాతలఁ దిరస్కరించునంతటిసమర్థత నాకుఁ గలదో లేదో నీవే యోజింపుము. సర్వము సర్వేశ్వరుమాయ గాక యితర మగునా? దీర్ఘదర్శి వగునీవు! న్యాయశీలుఁడ వగునీవు! జ్ఞానమూర్తి వగునీవు! భవలతాలవిత్రుండును సకలభూతసుఖాసుఖదప్రభావుఁడును నగు మహాదేవుని నిందింపకుము. నామనంబును గుర్తింపనలె నన్న వే ఱొకమార్గమునఁ బరీక్షింపుము.

యము— ఛీ! ఛీ! మాయ మింక నీనోరు. నిన్ను విడువను అధర్మమున కిచ్చగింపను. పట్టినపట్టు మానను.

మార్కం—ఓసమవర్తీ! యధర్మ మించుకయు గాదు. దూర మాలోచింపుము. నీదర్శనభాగ్యమున ధన్యుఁడ నగుదు ననియువ్విళ్లూరుచున్ననాహృదయమును గమనింపక కేవలము నిందితునిగా నూహింప నగునా? మహాత్ముల యాగమనము పరమహర్షానుసంధానమనివచింతురే? నాయందు దయఁ దలంచి జరాభారపీడితు లగునా తల్లిదండ్రులగోల విచారించి మన్నించి రక్షింపుము.

యము:—నీయీమాటలు నాకడ సాగిరావు. కల్లబొల్లిచమత్కారములకుబ్బి తబ్బిబ్బు లగువాఁడ గాను. సర్వేశ్వరుఁ డొసంగిన పదియాఱువత్సరములగడువు పూర్తియైనది. భగవదాజ్ఞకు వ్యతిరేక ముం

డదు. నీవు బాలుఁడవు నేను కాలుఁడను. నీ కింకను భయము లేన
ట్లున్నదే? జాలియనునది నా కేకోశమందును లేదుసుమా!

మార్కం:—ఓ! యమునాగ్రజా! యెంతవేడికొనినను నీ కావంతయుఁ
గరుణ రా దయ్యెనే? ఇంతనిర్దాక్షిణ్యము తగునా? వసంతసమయ
పల్లవితనికుంజపుంజములచే నలరారు మావిగున్నపై విచ్చలవిడి
విహరించెడుకలరవము ముండ్లడొంకలఁ దిరుగ సమ్మతించునా?

యము:—ఔరా! క్రూరా! యే మంటివి? నా యాస్థానము ముండ్ల
డొంకకు సమానమును నీవు పికసప్రతిమానుఁడవునా? యెంతకావర
ము! నీయిప్పటివర్తనమే చెప్పుచుండ నాపరోక్షమున నస్మత్కింక
రులఁ దూలనాడు టబ్బురమా?

శా. ఔరా! దుర్విషయప్రచారుఁడ! తృణ ♦ ప్రాయుండ వీవెంత నీ
భీరం బెంత? యముం డనంగ సకలో ♦ ర్వీచక్ర మల్లాడఁగాఁ
గ్రూరా! నన్నుఁ దృణీకరించెదవె? కొం ♦ కున్ జంకు లేకుండ! నీ
ధీరత్వం బదియెంతొ! చూచెదను మ ♦ ద్వీరప్రతాపంబునన్॥

మార్కం:—(లింగము డాసి పత్రిచేఁ బూజించుచుండును.)

యము:—ఓరీ! మదాంధీభూతచేతస్కుఁడా! అస్మత్కోపానలంబున
నిదే భస్మ మగుదువుసుమా! నీనిర్లక్ష్యభావము మఱింతరవుల్పుచు
న్నయది. ద్రోహీ!

మార్కం:—(స్వ) ఇఁక నీతనిఁ బ్రతిమాలినలాభము లేదు (ప్ర)
ఓయీ! మందమతీ! నిర్లక్ష్యము గా కేమి? వినుము.

మ. హరుఁ డాత్మావనదీక్షితుండు దన ♦ వాఁ డై యుండ నెవ్వానికిన్
వెర వేరీతిజనించు? నీవెఱుఁగవే ♦ నిన్ విన్మ నామాట! శం
కరపాదాబ్జవిహారభృంగ మగుమా ♦ ర్కండేయుఁ గొంపోవ నీ
తరమా? యేల? వృథా శ్రమంబు? చనుమా! ♦ తర్కింపకుండన్ వెసన్

యము:—ఔరా! దుర్మదా! యెంతనిష్కంపముగా వదరుచుంటివి? నిన్నుఁ గొంపోఁ జాలనుగా?

అనుబంధము—36

మార్కం:—ఓయీ! కాలుఁడా! యేలపల్గల్భము లాడెదవు? సకలశా త్రివారణ్యాకుశాం రుఁ డగుత్రిపురాంతకు భజించెడునాకు నిష్కంపము గా కేమి?

మ. సకలోర్వీతలజంతుసంతతమన ♦ స్సంక్షోభ ఘోరాయుధ
ప్రకరాడంబరదీర్ఘదంష్ట్రిచటులో ♦ గ్రధ్వానముల్ గాంచి మా
మకచిత్తస్థితి కంప మొంద దదని ♦ ర్మాల్యంబు పో ద్మింక పా
తకులన్ శిక్ష లొనర్ప శైవమతభ ♦ క్తశ్రేణిపై బోకుమా!॥

అటుగాక యనిమిత్తముగఁ జెలరేఁగితి వేని భక్తసంరక్షకుఁడగురుద్రుఁ డూరకోనఁడు. నన్ను దూషించుట నాయిష్టదైవమును దూషించు టయేయగును. నాయంతరాత్మ శివునియందు లగ్నమై యుండుట యే యందుకు కారణము నీవును శంకరున కొకకింకరుఁడ వగుటఁ బ్రభుతిరస్కారమహాపాతకమునం బడుదువు. స్వామిద్రోహి యగు వాఁడు తనపదవినే గాకప్రాణములపై తముఁ గోలుపోవలసి వచ్చు ను. శివదూషణమహాపాతకఫలం బింత యనివచింపుట కశక్యము. దేవదేవునినిందించుట నిన్ను బంధింపఁ దగినపరికరముల నీవే సిద్ధపఱ చుకొనుటగాఁ దలంపుము. భగవంతునిదూషించినవా రెంద రధో గతులం బడిరో స్మరింపుము. భవదున్మత్తప్రలాపోద్భూతదుస్సహా క్రోధానలంబున రుద్రుఁడు నీగర్వభంగ మొనరింప దుముకులాడు చుండె నని నమ్ముము. కమలసంభవాదు లడ్డపడినను నిటలాక్షుని వారింపఁ జాలరు. త్వదుత్తమాంగ మాత్రిశూలధారకెరఁ జేయక

వినుమిఁక. నీదూత లీనాఁడు కొనసల్పిన నిందలకును యిప్పటినీపరుష వాగ్విజృంభణమునకును గలిగిన పాపకూపమునుండి బయల్పడ నెంతు వేని శంకరపాదారవిందముల డెందమున నిలిపి ధ్యానించి జ్ఞాననేత్రమున నొక్కమా రాయీశ్వరుఁ దిలకించి కరములు మోడ్చి నమస్కరింపుము. అటు కాదా! కానున్నది కాకమానదు. నే నిం కేమియుఁ జెప్పఁజాలను. పిదప నీయిష్టము.

యము:—రే! కలుషా! నీవు సాధ్యము కావుగా? చూచెదఁ గాక! కమలసంభవాది ప్రముఖులకును వారింప శక్యముగాని మహారౌ ద్రమున నుప్పొంగుచుఁ ద్రిశూలధారి యగురుద్రుఁడు నన్ను దండిం పవచ్చుచుండెనా? యింతటి యధర్మమున కొడిగట్టినవాని త్రి శూలమా? మదుత్తమాంగము స్పృశించునది? పాపీ! దుర్మదోద్రే కమునఁ గన్నుఁగానక మిట్టిపడెదవా? చండప్రచండమండితాఖండ లుం డగుదండధరుండు, నీచే దూషింపఁబడెడువాఁడా? క్రూరా!

మ. చటులప్రౌఢిగదాగ్రఘట్టనలచేఁ ♦ జండాడుచు న్నిన్ను మ
దృటసంఘంబులు కాలరాయు నపు డ ♦ బ్బా తాళలేనంచు సం
కటముల్ బొందెదువేల యయ్యొ, నిటనీ ♦ గర్వోక్తులన్గట్టి మ
చ్చటఁజూపింపగ వచ్చునీకుఁ గలధీ ♦ చాతుర్యముల్ దుర్మతీ!

ఈక్షణమాత్ర శేషలోక మనస్సంతాపహేతుభూతం బగుకాల పాశానలంబున ని న్నిప్పుడే నాశన మొనరించెద జూడుము (అని పాశమునుఁ దీయఁ బ్రియత్నించును.)

మార్కం— ఓయీ! కాలుఁడా! వదరకుము. సకలజగద్భీకరదుస్తరని రుపమానవిస్ఫులింకశిఖాసంకలితఫాలనేత్రాగ్నిజ్వాలకన్న నీపాశా నలజ్వాల గొప్పది యగునా? వినుము.

యము:—ఔరా! దుర్మదా! యెంతనిష్కంపముగా వదరుచుంటివి? నిన్నుఁ గొంపోఁ జాలనుగా?

అనుబంధము—36

మార్కం:—ఓయీ! కాలుఁడా! యేలప్రగల్భము లాడెదవు? సకలశాత్రవారణ్యకుఠారుఁ డగుత్రిపురాంతకు భజించెడునాకు నిష్కంపము గా కేమి?

మ. సకలోర్వీతలజంతుసంతతమన ♦ స్సంక్షోభ ఘోరాయుధ
ప్రకరాడంబరదీర్ఘదంష్ట్రిచటులో ♦ గ్రధ్వానముల్ గాంచి మా
మకచిత్తస్థితి కంప మొంద దదిని ♦ ర్మాల్యంబు పో మ్మింక పా
తకులన్ శిక్ష లొనర్ప శైవమతభ ♦ క్తశ్రేణిపై బోకుమా!॥

మిత్తముగఁ జెలరేఁగితి వేని భక్తసంరక్షకుఁడగురుద్రుఁ
షు. నన్ను దూషించుట నాయిష్టదైవమును దూషించు
ాయంతరాత్మ శివునియందు లగ్నమై యుండుట
ఆము నీవును శంకరుస కొకకింకరుఁడ వగుటఁ
ాతకమునం బడుదువు. స్వామిద్రోహి యగు
కపాణములపై తముఁ గోలుపోవలసి వచ్చు
పాతకఫలం బింత యనివచింపుట కశక్యము.
నిన్ను బంధింపఁ దగినపరికరముల నీవే సిద్ధపఱు
పుము. భగవంతునిదూషించినవా రెంద రధో
ంపుము. భవదస్మత్పరిలాపోద్భూతదుస్సహా
నదురిఁపు నీగర్వభంగ మొనరింప దుముకులాడు
ము. కమలసంభవాదు లక్షపడినను నిటలాక్షుని
త్వదుత్తమాంగ మాత్రిశూలధార కెరఁ జేయక

సీ॥ కహకహధ్వాన భీ ♦ కరశిఖావృతసుప
ర్వసహతి క్రొక్కొంత ♦ సైపనచ్చు
ప్రళయకాలోద్భూత ♦ భయదహుతాశన
జ్వాలల క్రొకవేళ ♦ దాఁటనచ్చు
స్మరణమాత్రాశేష ♦ జంతుసంతాపహే
తుకబడబాగ్నిలో ♦ దుముకనచ్చు
సంప్రాకరాళ్య న ♦ కృత్రిభయానకముసహ
రించుమృత్యువునైన ♦ రింపనచ్చు
గీ॥ గాని దుర్వారదుర్భరా ♦ ఖండధూమ
పటలచటులారుణప్రభా ♦ భాసమాన
మున్నతిక్ష్యప్రతాపబం ♦ ధురదురంత
ఫాలనేత్రాగ్నికీలల్లో ♦ ర్వంగ దరమె?॥

కావున నీపాశముపేరుఁదలంపక వచ్చినతోత్రినం జని సుఖింపుము. (అని లింగముం జేరి) నమస్తే! శివా!

యము:—మూఢా! నశించితివి (అనిపాశము మెడవేయును.)

మార్కం:— (అనుబంధము 37) (లింగమును కౌఁగలించి)

(లింగాకారము గొప్పధ్వనితో బ్రద్దలై, శంకరుఁడు ప్రసన్నుఁడై మార్కండేయునితలపై నొకహస్త ముంచి రెండవకరమునఁ ద్రిశూలము యమునిశిరంబునకు గురిఁజేసి)

శంక:—రే! కలుషా! యమా! భక్తజనావనుం డగురుద్రుఁ డుండె నని యైనఁ దలంపక యీసుమారు హింసింప వచ్చితివిరా? ద్రోహీ! యిదే మదీయత్రిశూలంబునఁ హత మగుచున్నాఁడవు. (అనిపొడవ బోవ)

నార:—(ప్రవేశించి) ఈశ్వరా! క్షమించి శాంతింపుము. యముఁడా! తొలఁగుము.

శంక:—నారదా! దుర్మార్గము సహింప నగునా?

నార:—దేవా! నీవే మన్నింపకున్న నీకాలుఁడంతవాఁడా? పాపుల దండింప దండధరుండున్నాఁడనుభయమే లేకున్న లోకంబుల దుర్మార్గంబులు మితి మీరి కల్లోలములై పోవా? సర్వాంతర్యామివైన నీ వెఱుఁగవా? (యమునితో) యముఁడా! ఇంకను మూర్ఖుని పగిది నిల చుండెదవేల? నారదోపదేశతిరస్కారఫల మనుభవింపక తప్పునా? క్షమింపు మని వేఁడుము.

యము:—(తనలో) ఔరా! ఈనారదుఁడెంతవాఁడు! ఇప్పుడుశరణనక తప్పునా? అయినను భగవంతునిఁ గద వేఁడుట (ప్రకాశముగా) మహాదేవా! క్షమించి నావిన్నపమాలింపుము. దుష్టశిక్షణము మాత్రమే గాక జీవానిలగ్రహణమునకు సైతము నన్నే నియోగించినవాఁడవయ్యు నిష్కారణముగ దండింప వచ్చుట ధర్మమా?

శంక:—(శాంతించి)యముఁడా! శరణార్థివైనందునఁ గరుణించితి. ఇఁక నీబాలకుఁడు యోగశాస్త్రానుసరణ నిశ్చలతపః ప్రభావంబునను నిరూఢభక్తితత్పరత్వమునను నన్నుజయించి చిరాయువు నార్జించె; నిజభక్తాభీష్టప్రదానమె నాకర్తవ్యము. మనోబుద్ధిచిత్తాహంకారములఁ ద్యజియించిన నాభక్తు లందరానికోరిక లెందును లేవు. నీ వింక నిజనివాసంబున కేఁగుము.

యము:—చిత్తము. నీయీగంభీరాభిప్రాయ మెఱుంగనైతి. మన్నింపుము (అని నమస్కరించిమార్కండేయునితో) ఓభక్తాగ్రేసరా! మార్కండేయా! నీ వింతవాఁడ వని యిప్పుడుగ్రహించితి. చతుర్దశభు

వనైకపరిపాలనదక్షుఁ డగుశంకరుని యెట్టయెదు
ముకోలఁది నాకొసఁగుపరముల స్వీకరింపుము.

(అనుబంధము.—38)

మార్కం:—అజ్ఞానవశమున నిన్నేమైన దూలనాఁ
పుము.

యము:—సంతోషము పరాత్పరా! శంకరా! సెల
నినిష్క్రమించును)

నార:—(స్వ) ఈమాత్రిపుగర్వభంగము గానున్న గీ
మా? కాలునకొక్కనికే కాదు; తన యంతటివా
చి క్రిందు మీఁ దెఱుంగక మిట్టిపడుపత్రితివానికిని
గభంగముఁ గావించుచుండినం గాని తలపొంకె:
ఇప్పటికి నాకడుపు నిండినది. (తేరిపును.) మృక
త్యానందభరితు లగుదురు.

(మృకండమరుద్వతుల ప్రవేశము.)

మృకం:—పరాత్పరా! గిరిజావరా! నమస్తే! శంకరా!
నారదా! నీకృపావిశేషమున కెంతయుఁ గృతజ్ఞులఁ:

నార:—ఈశ్వరవిలాసము.

శంక:—మృకండమరుద్వతులారా! వీఁడుగో! మీబిడ్డఁ
రకాలజీవియై భవిష్యద్ధర్మశాస్త్రరచనాసమర్థుండైన
కెక్కఁగలఁడు. ఇంక నేమేని వలసినఁ గోరికొనుఁడు

మృకం:—తండ్రీ! నిఖిలలోకశరణ్యా!

మ. చిరజీవిత్వ మొసంగి నాకొమరునిన్ ♦ జేపట్టి రక్షి
వరయన్ గోర్కె లిఁకేమి కల్గు? భవదీ ♦ యంబై

ర్పరుపన్ గోరుచు నుంటి! స్వార్థులము మా ♦ పైఁ జూపవే నీకృపన్
దురితౌఘంబులఁ బాపి లోకముల సం ♦ తోషంబునన్ మన్పవే!॥

శంక—మీరు నాయెడలఁ గలభక్తితాత్పర్యములు కలవా రగుటచేఁ గాల మాసన్న మైనపుడు పుణ్యలోక మలంకరింతురు. ఇప్పటికి మీతనయునితో పురమున కేఁగుఁడు.

మృకం:—పరమేశ్వరాజ్ఞ శిరసా వహించితి.

శంక:—మార్కండేయా! నీ కేమైన వరములు గావలెనా?

మార్కం:—రక్షకా! నీదర్శనభాగ్యమునకంటె నే నేమి కావలయు? అయిన నిట్లుకూడఁ బ్రసాదింపుము.

గీ. భక్తజనవదనాబ్జసూ ♦ ర్యకరణి!
తావకీనానురాగసం ♦ ధానకరణి!
జీవకోటుల కెల్లసం ♦ జీవకరణి!
యైననీకృప జగములం ♦ దలరుఁ గాక!॥

శంక:—తథాస్తు! నీతల్లిదండ్రులఁ జేరుము.

మార్కం:—జననీజనకులారా! వందనము. (నారదునితో) నారదమునీంద్రా! నమస్కారము.

నార:—చిరంజీవివి! కల్యాణం భవతు.

మృకం, మరు:—తండ్రీ! రమ్ము (దగ్గఱకుం దీసుకొందురు).

(అనుబంధము—౩౭.)

(పుష్పవృష్టి కురియును. తెరపడును.)

ఇతిశ్రీమదాంజనేయచరణారవిందసేవాసక్తచిత్తపింగళి వెంకటనర్సయామాత్యవిరచితమార్కండేయ నాటకమునందు, సర్వము శ్రీరామార్పణము. శ్రీ. శ్రీ. శ్రీ.

అనుబంధము. 1.

హిం-కాఫీ-ఆదితాళం.

ఋషులు:—1వ పుట.

జయ! జయ! కమలాసన! భవతరణా! జయ! వాణీశ్వర! సద్గుణసదనా!॥జయ॥ జయసృష్టిస్థితిలయకారణ! శిష్టజనావన! సన్మునిపూజితపద॥జయ॥ అరయ సకలభువనమ్ములఁ ద్వన్మాయానిబద్ధములఁ గావించి యునాటలాడించెదవు కళాపరిపూర్ణత! సమలపదవిహారామరసేవిత జయ॥జయ॥ సకలము నీ వని సమ్మినముముక్షుసంతతికిన్ బ్రహ్మానందమె కద? వికలచిత్తులును సకళంకులు దావకసత్యంబు నెఱుంగఁ గలారే? జయ॥ జయ॥

అనుబంధము. 2.

రూపకము-నాదనామక్రియ.

మృకండుఁడు:—3వ పుట.

హా! విధీ! యిటుల లిఖించితే? నాయలికమున॥హా॥ ఈవిపరీతముగలుగు

నసుచు నాభానమునన్ దలపోయ నైతిగా ... ... ॥హా॥

పావన మగునీదర్శనభాగ్యమైనఁ గలుగక నాపాపమిటులఁ బండెనా?

పరమపురుష! పద్మగర్భ॥హా॥

అనుబంధము. 3.

ఏకతాళం-కళ్యాణి.

మృకండుఁడు:—3వ పుట.

జగదీశా! యీశా! అ అ... ... ... ॥జ॥

నిగమాంతవేద్య! నీపదాబ్జములఁ దగభజింతు నార్తజనశరణ్యా! మృగధరా! పన్నగధరా! సుగుణాకరా! సంస్తుతింతుఁ బురహర! ॥జగ॥

అనుబంధము. 4.

ఆది-బ్యాగ్.

మరుద్వతి:—5వ పుట.

సుదినమూ! సుదినమూ! సుదతులార! మీరలు మాయాశ్రమపథము నందుబదము లిడుటఁ నెమ్మది ముదం బయ్యె గడుంగడున్ ॥సుది॥
ఆడఁబోవుతీర్థము తనకే యెదురై సభాతి సఫల మయ్యెఁ గోరిక...
సుదినమూ॥

అనుబంధము. 5.

రూపకము-హిం-కన్నడ.

మరుద్వతి 6వ పుట.

ఎంతపాపకాల మాయెనో?నా... ... ... ॥కెంతపాప॥
సంతులేని, జన్మమేల? జగతీస్థలిన్ నా॥కెం॥ ఇంతఘోర మొదవు ననుచు, నెఱుఁగ నైతి నా కింత నీచమా? ... ॥ఎంతపాప॥

అనుబంధము. 6.

జంఝూటి-ఆది

మరుద్వతి:—7వ పుట.

సాధ్య మగునె? యెవ్వరికిన్! పరమేశులీలలనుఁ దెలసి మెలగఁ గాఁ ॥సా॥
సకలచరాచరజంతుసంతతుల జననస్థితిలయకర్మకారణుఁడు॥సా॥
సంతోష మొదవించు సంకటముఁ గలిగించు నంతదానై యుండు ననలే లేనటులుండు॥సా॥
ఎప్పటి కెవ్వరి కేది ఘటించునో? తప్పునే యది? ధాతకు నైనన్॥
సాధ్య మగునె?॥

అనుబంధము. 7.

రూపకము-నాదనామక్రియ.

మృకండుజుఁడు:—7వ పుట.

! విధీ! యిటుల లిఖించితే నాయలికమున ॥హా॥ ఈవిపరీతముగలుగు
ననుచు నాభావమునన్ దలపోయనైతిగా ... ... ॥హా॥
పావన మగునీదర్శనభాగ్యమైనఁ గలుగక నాపాపమిటులఁ బండెనా?
పరమపురుష! పద్మగర్భ॥ హా॥

అనుబంధము. 12.

(కుశలవనాటకములో "కుశా! నిశాపతిసమవదనా." అనుమాదిరి)

మార్కండేయుఁడు:—16వ పుట.

మౌనికులసుత్రామా! సకలాఘరహితశీయమా! విమలగుణకలా-
పా॥స॥ ముద మొదవఁగమీపదసరసిజముల్ మృదు ... పదసరసి
జముల్ మదిన్ వదలకఁ గదియిం ... తున్ ॥సమౌ॥

అనుబంధము. 13.

హిం-తోడి-త్రిశ్రజాతి.

శారద్వతుఁడు:—18వ పుట.

హాపాఠులార! పత్త్రపుష్పాపచయముఁ గావింపసరగునఁ బోదము ॥స॥
జగదీశుండగునీశ్వరు నర్చింపగ మనగురువుల కొసఁగుదము ॥సహా॥
కేతకి, గొజ్జంగి, కేదార, మందార, చూత, భల్లాత, కామ్రాత,
ప్రసూకము, లాతతభక్తిఁ గుశాగ్రముల్, సమిధలఁ జేతోముదం
బునఁ జేకొనర రం డిటు॥సహాపాఠులార॥

అనుబంధము. 14.

నాదనామక్రియ-రూపకము.

అందఱు:—21వ పుట.

శివ! శివ! శివ! శంభో! గౌరీవర! సకలేశ్వర! ॥శివ॥

భవలతాలవిత్రా! సుచరిత్రా రిపుజైత్రా! పవిమలాంగ! నిట లాక్షా! పాహి! గంగాధర! హర! ॥శివ॥
సన్నుతిఁ జేసెద నిన్నుఁ బ్రసన్నహృదయ! బోధ్రువముడయఁ గన్నడ సేయకుమయ్యా! పన్నగభూషణ! శంకర! ॥శివ; శివ!॥

అనుబంధము. 15.

బారువ-ఆది.

మార్కండేయుఁడు:—23వ పుట.

అకళంకుం డగుదేశికుకడ నే నభ్యసించితిని జనకా సకలశాస్త్రములు సర్వాగమములు ప్రకటితసూత్రాధికగ్రంథంబులు ॥అక॥ చదివిన దానికి సారముఁ గంటిని విద్యకు వినయమె భూషణ మనుచున్, ముదమున ననుగురుఁ డెద దీవించెనొ సదయునిశంకరుఁ దయ గల్గుటచే ॥అ॥

అనుబంధము. 16.

ఆనందభైరవి-మిశ్రజాతిఆట.

మార్కండేయుఁడు:—24వ పుట.

పరమేశ్వరుని భజియింపవలె దండ్రీ! శతవర్షములు సంపూర్ణమై, ధృతిఁ దూలి శ్రీమలం బడక మును ॥పర॥ పరమున్, గసగన్ కరుణాక రునిన్ హరునిన్ సకలేశు గంగాధరుని శివు॥ పర॥ బారాసుతులు పైబడి యేడ్వకమున్నే! తవిలి యమదూత లలసటఁ బరుపక మున్నే! గళములోఁబడి భూతపంచకగతులు మాఱ్పడిపోకమును॥ పర మేశ్వరు॥

అనుబంధము. 17.

జంఝాటి-త్రిశ్రగతి

మార్కండేయుఁడు:—25వ పుట.

కారణ మేమి? నాజనని కనుల నీరునింప॥కా॥
నేరక నే నేమిపాపకార్యం బొనరించితినో? సారవచోరచన మానె

గూర్చియనుచు నను గాంచవేమి శ్రీకృష్ణ నన్ను మాటల నాడిం
చుచుఁ బాలింపవేని కృష్ణ నాలించి మఱుజోసిప్రియుల సరిమితంబుగ
నించెది నివసించ బన్నుపు. నాంపస్థ! నీ స్నేహమంచు సయో॥ కార॥

అనుబంధము. 18.

రాగము—ఆది (ఆద్యభవనానీసాక)

మార్గ్యం దేయుము:—3?వ పుట.

చిత్తమా! యీ ద్వైతమయమ్మగు బ్రహ్మము! ... ... చి॥
పాపకార్యములకుఁ బోవకుమా!
(చరణము) అనిత్య సుఖములకొఱకు విభవముల సత్యమని బో
ధించకు యీ వాక్యంబులెల్ల చింతనసేయుచుఁ గడకుఁ గైవల్యపదవిఁ
గాంచగా॥ చి॥
పరమేశ్వరుచే సృష్టింపఁబడిన పంచభూతాత్మకప్రపంచమున సర
యుఁగ సద్విజ్ఞుల మాని మునిపురుషులవోలెఁ బోకుమా॥ చిత్తమా॥

అనుబంధము. 19.

కాపి—ఏక

మార్గ్యం దేయుము:—35వ పుట.

జయ! జయ! మృత్యుంజయ! శంకర! శివ! సకలేశ్వర! శంభో! హర
హర॥ జయ॥ జయ జయ గంగోత్తమాంగ! స్మరహర! జయ గౌరీ
రమణా! వృషభవాహా!॥ జయ జయ॥

అనుబంధము. 20.

హిం-కన్నడ-ఆది.

మార్గ్యం దేయుము:—35వ పుట.

మానవజన్మము దొరకుట కష్టము! మహిలో వినుమనసా! యోమన
సా॥ మా॥ మానుగ నది లభియించిన జ్ఞానము నూని జరింపగ నౌ

మనసా! మనసా!॥ మా॥ సకలజగంబులు! చరాచరములు! సర్వేశు నిదయ గల్గుటచే మనసా! వికలము గాక పెం పొందెను నెల్లెడ సుకృత మటంచును చూపరు లలరఁగ॥ మా॥ తల్లిదండ్రిగురుదారాసుతులునుఁ గల్లయనుటయే తెల్లము॥ మనసా॥ తృళ్లిపడకు నీవి భవముఁ గగ్గొని దుర్మతములఁ దరిబోకుము మనసా॥ మా॥ నిరత మీశ్వరునిసేవ లొనర్చుచు నిర్మలసుఖాస్పదం బగు కైవల్యమును గాంచి మరల బాపనిలయం బైన పుట్టువుం జెందకుమనసా॥ మా॥

అనుబంధము. 21.

బారువ-ఏక.

మార్కండేయుఁడు:— 36వ పుట.

జయ॥ జయ॥ మృత్యుంజయ! శంకర! శివ! సకలేశ్వర! శంభో! హర హర॥ జయ॥ జయ జయ గంగోత్తమాంగ! స్మరహర! జయ గౌరీ రమణా! ఋషభవాహా!॥ జయ జయ।

అనుబంధము. 22.

బారువ-ఆది.

మార్కండేయుఁడు:—(తనలో) 37 & 38 పుటలు.

నీకుఁ జిరాయు వొసంగె శివుం డని నీతిమాలిగర్వింపకుమా! లోకరక్షకుని సతము భజింపుచుఁ బారికటధర్మం బనుష్టింపుమా!॥ చిత్తమా। జననీజనకులపాదాబ్జములకు సాష్టాంగనమస్కారంబు లొసఁగి ఘనులగు నీఋషులబోధ నీనెమ్మనమున నిడుకొని హరుని భజింపుము॥ చిత్తమా॥

అనుబంధము. 23.

ఆది-శుద్ధదేశి.

మరుద్వతి:—39వ పుట.

నాకుమారువే రెదఁ దలపన్ నాకేమియో తాప మగుచునుండె నిఁ

కేమిసేయుదూసఁ దోఁచ దేదియు నా కేఁగతిని విధాతలిఖంచెనో॥నాకు॥ హర! మహేశ! శ్రీధర! వరదా! కాత్యాయనీశ! దీనజనశరణ్యా! పరమపురుష! రజతశైలాధివర! దురితదూర! నామొర లాలింపుము॥ నాకు॥

అనుబంధము. 24.

బారువ-ఆది.

మార్కండేయుఁడు:—45వ పుట.

జననీ! వినుము నామనవి! విలపింపను నాకై మదిని ననుఁ బంపుము ధైర్యమూని॥ ఓ ఓ ఓ ... ... జననీ॥ ధారుణిపైఁ గలబ్రతుకు దీరిపోవకయెమృత్యువుగోరిన యపుడరుదెంచునె? యేరికైనఁదలుపఁగన్॥ మృత్యుంజయుసేవకు నను మృత్యువేమిసేయఁ గలదు? సత్యస్థిరు లగుభక్తులఁ బ్రిత్యహ మతఁడేలడే॥ జన॥

అనుబంధము. 25.

(డైలాగ్) హిం-కాఫీ-ఆది.

46వ పుట.

I. మార్కం:—మాతా! నీవీతీరునవిలపింపక దగ దమ్మా! సతతము సర్వేశ్వరుఁడే తోడని మతిఁదలపుము! నాపై బ్రేమక ధృతిఁ దూలకుసర్వమును నెఱింగియు సుతునిజీవితమునకు వెత జెందకు॥ మా॥

II. మరు:—కనుపాపఁ గనినుగంటినినా యడ లుడిపెద వనినమ్మితి నన్గడకేనాటికి నిచట విడచియే చనియెదవా? కానలకున్॥

III. మార్కం:-తప్ప దమ్మా! ధరణిలోనన్ ధాతవ్రాసినవ్రాత లెందున్ మెప్పుడో యేవేళనో స్మృతిఁ దప్పుటే నిజమగుఁ బ్రాణులకును మాతా॥

అనుబంధము. 26.

ఆనందభైరవి—అట.

మార్కండేయము:—46వ పుట.

ప॥ మహిమహిమ నతియింతు సర్వేశా! భవదీయమహిమల నెవరి కగు
నెరిఁగింప శక్యమా!॥ ఓ దేవా! యెచటఁ గాంచిన నీప్రపంచమున
నీవైయుందువు నాదేవా॥ యో॥ అహహ! సర్వ చిత్తము లెంతయుందు
నై జరియింతు నని తోఁచుచునుంటివని వాత్రి యుంటును
శంకరీ! సర్వనియామకా, సకలకర్మల సాక్షి నగుభగవంతుండవు!॥ యో॥

అనుబంధము. 29.

హిం—మోహన—ఏకతాళం.

మార్కండేయము:—48వ పుట.

శివ దేవా! రుచిరదేవా! శేషాభూషా!॥ దే॥ సకలచరాచరమయ మగు
బ్రహ్మాండకటాహమునందు నెల్లెడలన్ బ్రకాశితముగ నీస్వస్వరూప
మెవారుమంచి జగదీశుఁడై సకలచిత్తులను పండించెదవు త్రానక పదునర
సీరూపముల నమ్మితి. భవబంధవిమోచన! శంకర! శివ! భువనపావ
నా! విబుధార్చా! శివ॥

అనుబంధము. 33.

మోహన—ఏక

యము:—62వ పుట.

డింభకోచ బహిమార్త్రైన విజృంభించిన భుజశౌర్యము దంభంబులు గావు
యథార్థంబు నాదినమువినరా॥ డిం॥ కుంభినిపైఁ దానులు సదంగూ
ఢిసఁ గలవారలంబు లంభోధులు గలిగిన ధర్మాచరణమునను గాం
చెడి శివ సుదిగరుకోటిగవిద్యాధరకిన్నరు లాదిగ నిర్జరు లక్షంబైన
ను శ్రీకరిగవచేఁ జెంతాకెద॥ డింభ॥

అనుబంధము. 35.

హిం-బ్యాగ్-ఆది.

మార్కండేయుఁడు 66వ పుట.

పురహర! గిరిశ! సురమునిపూజితచరణాంబుజయుగ! సర్వేశా!॥ పుర॥
కరుణాకర! శ్రితలోకశరణ్యా! కాలకంఠ! గంగాధర! జయ జయ॥ పుర॥

సా:—హేదుష్టశిక్షణ, శిష్టరక్షణ కళాపరిపూర్ణా! హేసగుణ! నిర్గుణ! సచ్చిదానందస్వరూపా!

చరణం—సరిపదివిధముల మొరఁ జేసెడిన స్మరమక సేయకు! పరమదయాభా॥ పురహర॥

అనుబంధము. 36.

బ్యాండుమట్టు.

యముఁడు 70వ పుట.

దురహంకారా! దురితవిచారా! నిరుపమక్రూరా! నిను నిఁక సైపను పరిమార్తుఁ ఖలా!॥ దు॥ ఈ నా కరమునఁ గలపాశమ్మున నీదుజీవమ్ముఁ దీసి కాలరాచిఁ నాశన మ్మొనరింతు నిదే! దుష్టా! కాచికొమ్మా!॥ దుర॥

అనుబంధము. 37.

పూర్ణషడ్జమం-ఏక.

మార్కండేయుఁడు—72వ పుట.

హరా! పురందరార్చితపదారవింద! శ్రీధరా!॥హ॥ కారుణ్యసాగరా! కలుషవిదూర! కామితమందార! శంకరా! భరియింపఁగఁ జాలను, యమబాధల సాధుజనపోష॥ హరా!॥

అనుబంధము. 38.

సురట-ఆది.

యముఁడు-74వ పుట.

లోకనిచయము దయాపరత నాలోకించెను సర్వేశ్వరుఁడు కృపచే, నీకసాధ్య మగుకార్యం బేదియు, లేక యుండుఁగాక ప్రకటంబుగ॥ లోక॥ నీచ రిత్రవినినను జదివినఁ జింతించినను లిఖియించినవారల నేచనుం డుఁగాక పాపనిచయము స్వేచ్ఛారతి దివిఁ జేరుదురుగాక॥ లోక॥

అనుబంధము. 39.

సురట-ఆది.

మృకం, మరు-75వ పుట.

ఆనంద మానంద మాయె మహానుభావుఁడై నశంకరునికృప॥ నానంద॥ ఏమాయెఁడేమగునో యనుచుఁ దలంచిన మానసాంబురుహములు విక సించెనుఁ మానుగఁ ద్రిజగంబుల యందున సన్మంగళప్రదంబై రాజిల్లగ॥ నానంద॥ హర! హర! మృత్యుంజయ! సర్వేశ్వర! హర! హర! గౌరీవర! శ్రితరక్షక! దురితదూర! నిరతముఁ 'గాపాడుము స దా! కరిచర్మాంబర! మంగళ॥ మానంద॥

సరస్వతీగ్రంథమండలి

రాజమహేంద్రవరము.

(ఏప్రిల్ 1923)

అధ్యక్షుఁడు — వేపల్లి లక్ష్మణస్వామి.

సంపాదకుఁడు — తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి.

నవలలు—నవరసభరితములగు నవలలు—చారిత్రిక—సాంఘిక—సాంసారిక-జ్ఞానపరిశోధక—నవలలు—పుణ్యచరిత్రములు—ముచ్చటైన—బొమ్మలతో—లులకు క్యాలికో బైండుతో రెండు మాసములకొక్కటిగా వెలువడుచుండును.

నిబంధనలు.

1. ఇందుఁ జందాదారుగఁ జేరువారు ప్రవేశరుసుము క్రింద ముందుగా -4-0. లు చెల్లింపవలయును.

2. ఇందు రెండేసిమాసములకొక్కటిగ వెలువడుచుండు క్యాలికో బైండుగల గ్రంథమును రు 1-0-0 వెలకుఁ జందాదారులకుఁబంపుచుందుము.

3. గ్రంథములఁ బంపుటకగు పోస్టేజి మొదలగు ఖర్చులన్నియును జందా తే భరింపవలయును.

4. చందాదారులగువారు వెనుకటి గ్రంథములన్నియును గొనవలయునను మములేదు. కాని వారుకోరినచో వెనుకటి పుస్తకములు కూడఁ జందాదారుల పంపుచుందుము క్రొత్తగ వెలువడుచుండు గ్రంథములు మాత్రము చందా లు తప్పక పుచ్చుకొనుచుండవలెను.

5. ఇందుఁ బ్రకటింపఁ బడువనుబంధములు చందాదారులు తప్పక పుచ్చు లయునను నియమములేదు. కోరినవారికే పంపుచుందుము.

6. సంవత్సరముచందా—అనగా ముందుప్రకటింపఁబడు ఆఱుపుస్తకములకు -2-0 లు ముందుగఁబంపువారికి ఆఱుపుస్తకములవెలకు ప్రతిపుస్తకమును జిస్టర్డు పారసీలుగా పంపుచుందుము. అట్లు పంపినవారికి ఆఱుపుస్తకములకు వలసిన మనిఆర్డరు కమీషను రు 0-12-0 లును రిజిష్టరుఖర్చు రు 0-12-0 లును 3-0 కూడిపచ్చును.